ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

బుధవారం 27 నవంబరు 2024





ఉదయం 9 గంటలకు కూడా మూసి ఉన్న వెల్దుర్తి మండలం ఉప్పలపాడు పశువైద్యశాల

పశువైద్యం.. దైన్యం!

- కొన్నేళ్లుగా భర్తీకి నోచుకోని పశువైద్యుల పోస్టులు
- అరకొర సిబ్బందితోనే వైద్య సేవలు
- ఆరు నెలల నుంచి మందుల పంపిణీ ఊసేలేదు
- గత ప్రభుత్వంలో పథకాలన్నింటికి మంగళం
- శిథిలభవనాల్లో ఆసుపత్రులు...మేత అందించే విషయంలోనూ నిర్లక్ష్యమే
- పోషణ బరువై సంతలో అమ్మేసుకుంటున్న రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మూగజీవాల వైద్యం పట్ల కూడా ప్రభుత్వాలు శీతకన్నే వేస్తున్నాయి. గత ప్రభుత్వం పశువులకు వైద్యం అందించే విషయంలో కూడా కనికరం లేకుండా వ్యవహరించడంతో పాడి రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. పేరుకే పశువైద్యశాలలు తప్ప సరిపడా సిబ్బంది మచ్చుకైనా కనిపించని దుస్థితి. మూడు నెలల కొకసారి పంపిణీ చేయాల్సిన మందుల విషయంలో గత ప్రభుత్వం ఎడతెగని జాప్యం ప్రదర్శించి ఎన్నో మూగజీవాల మృత్యువాతకు పరోక్షంగా నాటిపాలకులు కారణమయ్యారు. కూటమి ప్రభుత్వంలోనూ అదే తంతు కొనసాగుతోంది. గడచిన ఆరు నెలలుగా పశువైద్యశాలలకు మందుల పంపిణీ జరగలేదంటే నిర్లక్ష్యం ఏ రీతిన ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇండెంట్ పెట్టడం జరిగిందని త్వరలోనే మందుల పంపిణీ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పశువుల విషయంలో అమలులో ఉన్న అనేక పథకాలకు గత ప్రభుత్వం తూట్లు పొడవడంతో వాటి పోషణే రైతులకు తలకు మించిన భారంగా మారడంతో చాలా వరకు సంతలో అమ్మేసుకోవాల్సిన దయనీయ పరిస్థితిని పాడి రైతులు ఎదుర్కొన్నారు. ఇక వైద్య శాల భవనాలు అయితే చాలా వరకు శిథిలావస్థలోనే దర్శనమిస్తున్నాయి. ఈ బాలారిష్టాలపై దృష్టి పెట్టాల్సిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ పశువుల ఆసుపత్రుల సమస్యలపై దృష్టి పెట్టకపోగా మూడు నెలలకొకసారి పంపిణీ చేయాల్సిన మందుల విషయంలోనూ శీతకన్నే వేసింది. ఇప్పటికైనా పశువైద్యంతో పాటు రాయితీ పథకాలన్నీ పునరుద్ధరించే దిశగా కూటమి పాలకులు చర్యలు తీసుకుంటేనే జిల్లాలో పాడి రైతు మనుగడ సాగించే పరిస్థితి ఉంటుందని లేకపోతే వ్యవసాయ అనుబంధంగా కొనసాగుతున్న పాడి పరిశ్రమ త్వరలోనే కనుమరుగు కావడం ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



నరసరావుపేట పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఉన్న మందుల నిల్వలు

పల్నాడు జిల్లాలో దాదాపు ఆరు నెలలుగా పశు వైద్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో మందుల కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. పశు సంవర్ధక శాక జిల్లా కార్యాలయాలకు మందుల నిల్వలు చేరుతున్నాయి. ఇక్కడ నుంచి పశు వైద్య శాలలకు మందులు సరఫరా చేయాల్సి ఉంది. జిల్లాలో ఏడు పశువైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 58 మంది వైద్యులకు గాను 51 మంది విధుల్లో ఉన్నారు. నెలాఖరుకు పశువులు మందులు ఆస్పత్రులకు సరఫరా చేయనున్నట్టు పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ పీ రామారావు తెలిపారు.

పశు వైద్యశాలలు	:	14
గ్రామీణ పశువైద్యశాలలు	:	37
వైద్య చికిత్సా కేంద్రాలు	:	64
ల్యాబ్‌లు	:	7
రైతు సేవా కేంద్రాలు	:	239
గొర్రెలు.. మేకలు	:	6.50 లక్షలు
ఆవులు, ఎద్దులు, గేదెలు, దున్నలు	:	5.20 లక్షలు



బాపట్ల ఏరియా పశు వైద్యశాలలో గేదెకు వైద్యం చేస్తున్న డాక్టర్

మూడు నెలల కొకసారి....

పశువుల ఆసుపత్రులకు మందుల పంపిణీ విషయంలో ప్రతి క్వార్టర్ ప్రామాణికంగా పంపిణీ జరుగుతూ ఉంటుంది. కానీ గత ప్రభుత్వం ఈ రివాజుకు తిలోదకాలిచ్చి నెలల తరబడి మందుల పంపిణీ జరపకపోవడంతో పాడి రైతులు అధిక ధర వెచ్చించి మందులను బయటి కొనాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వంలో మందుల పంపిణీ విషయంలో అదే నిర్లక్ష్యం కొనసాగుతుండడం గమనార్హం. గడచిన ఆరు నెలలుగా పశువుల మందుల పంపిణీనే జరగలేదు. ఇండెంట్ పెట్టడం జరిగిందని త్వరలోనే అన్ని వైద్యశాలలకు మందులను సమృద్ధిగా పంపిణీ చేయడం జరుగుతుందని యంత్రాంగం చెబుతోంది

రాయితీ పథకాలన్నింటికీ మంగళం...


ప్రస్తుతం పాడి పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడడం వెనక గత ప్రభుత్వం అవలంబించిన విధానాలు కూడా కారణంగా ఉన్నాయి. ముఖ్యంగా పశుబీమా విషయంలో ఏళ్ల తరబడి జాప్యం చేసి పాడి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 2014-19 మధ్య నిర్మాణం చేపట్టిన గోకులాలకు బిల్లులు చెల్లించకపోగా ఆ పథకాన్నీ అటకెక్కించింది. ఇక దాణా విషయంలో అందించే రాయితీలపై గత ప్రభుత్వం శీతకన్ను వేయడంతో పోషణ భారంగా మారి పశువులను అయినకాడికి అమ్ముకునే దురవస్థను పాడి రైతులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూడా టీఎంఆర్ మాత్రమే అందుబాటులో ఉంది తప్పితే రైతులు మొగ్గుచూపే శైలేజీ దాణా పంపిణీ జరగడం లేదు. ఇప్పటికే గోకులం షెడ్డుల పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. పశువుల దాణా విషయంలో గతంలో ఇచ్చిన రాయితీలన్నీ అమల్లోకి తేవడంతో పాటు ధర తక్కువగా ఉండే శైలేజి రకాన్ని అందుబాటులో ఉంచాలని పాడి రైతులు కోరుతున్నారు.

- అధికారుల కళ్లకు మామూళ్ల గంతలు
- ఒక్కో పట్టణానికి ఒక్కో రేటు
- ఉమ్మడి గుంటూరుకి ఒక రేటు

రహదారి భద్రత రవాణా శాఖ గాలికొదిలేసింది. ఓవర్ లోడ్‌లో టిప్పర్లు రోడ్లపై దూసుకుపోతున్నా చర్యలు తీసుకోవాల్సిన రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోకుండా మామూళ్ల వసూళ్లకు పాల్పడుతున్నారు. పనిలో పనిగా ఇటీవల మామూళ్ల రేటు కూడా పెంచారని వాహనదారులు చెబుతున్నారు.

మామూళ్లు.. ఓవర్ లోడ్

పరిమితికి మించి లోడుతో దూసుకుపోతున్న టిప్పర్లు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రవాణా శాఖలోని కొందరు అధికారులు టిప్పర్ లారీ యజమానుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో క్వారీలు, స్టోన్ క్రషర్‌లు, ఇసుక రీచ్‌లు ఎక్కువగా ఉన్నాయి. సహజంగా లారీ లోడ్‌ని బట్టి కాకుండా



ఓవర్ లోడ్‌తో టిప్పర్

సరుకు బరువుని బట్టి కిరాయి, ధర ఉంటుంది. దీంతో లారీ యజమానులు ఎక్కువ మొత్తంలో సరుకు రవాణాకు మొగ్గు చూపుతున్నారు. ఇది రవాణా శాఖ ఉద్యోగులు కొందరికి వరంగా మారింది. ఓవర్ లోడ్ వాహనాలకు పట్టణానికి ఒక ధర చొప్పున నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంకో విశేషం ఏమిటంటే రాజకీయ నాయకులు పేరు చెప్పి మరీ వసూళ్లకు దిగడం గమనార్హం.


ఓవర్ లోడు వాహనాలు గుంటూరు నగరంలోకి వెళ్లాలంటే నెలకు రూ. 17,500, తెనాలి, మంగళగిరి, చిలకలూరిపేటలలో రూ. 6,000, పిడుగురాళ్ల, నరసరావుపేట రూ. 12,000, బాపట్ల రూ. 9,000 చొప్పున చెల్లించాల్సి వస్తోందని యాజమానులు వాపోతున్నారు. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా మొత్తం తిప్పాలంటే, నెలకు ఒక్కో టిప్పర్‌కు 68,000 పైగా చెల్లిస్తున్నట్టు లారీ యజమానులు బహిరంగంగానే చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 500 వరకు టిప్పర్లు న్నాయని, వాటిలో 70శాతానికి పైగా (మిగతా 8వ పేజీలో)

నడికుడి-కుక్కడం డబ్లింగ్‌కు టెండర్

- రూ. 647.88 కోట్ల అంచనావిలువతో ప్యాకేజీ రూపకల్పన
- రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసేందుకు షరతు
- పూర్తి అయితే 48 కిలోమీటర్ల రెండు వరసల రైలు మార్గం అందుబాటులోకి

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే కుక్కడం - కేంద్రపోలు మధ్యన పనులు ప్రారంభం కాగా మరో సెక్షన్ నిర్మాణాన్ని చేపట్టాలని రైల్వే శాఖ నిర్ణయించింది. నడికుడి - కుక్కడం మధ్యన ఉన్న 48 కిలోమీటర్ల పొడవునా రెండో వరస రైలుమార్గం నిర్మాణానికి ప్యాకేజీని రూపొందించింది. ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో టెండర్లు పిలిచింది. రైలుమార్గంతో పాటు విద్యుదీకరణ, సిగ్నలింగ్ వర్కులను కూడా ఇందులో చేర్చింది. ఈ సెక్షన్‌లో డబ్లింగ్ ప్రాజెక్టు రూ. 647.88 కోట్ల విలువ అవుతుందని అంచనా వేసింది. ప్రీబిడ్ కాన్ఫరెన్స్‌ని డిసెంబరు 12వ తేదీన ఉదయం 11.30 గంటలకి, బిడ్డింగ్‌ని జనవరి 18వ తేదీన నిర్వహించనుంది. గరిష్ఠంగా 30 నెలల్లో ఈ పనిని పూర్తి చేయాలన్న షరతుని కూడా టెండర్ నోటిఫికేషన్‌లో పొందుపరిచింది.

గతిశక్తి కార్యక్రమం కింద గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు మొత్తాన్ని ఒకే ప్యాకేజీ కింద కాకుండా నాలుగైదు ప్యాకేజీలుగా విభజించి చేపట్టడం వలన త్వరగా పనులు పూర్తి అవుతాయని రైల్వే శాఖ భావిస్తున్నది. ప్యాకేజీలన్నింటిలో అత్యంత కీలకం, క్లిష్టమైనది నడికుడి - కుక్కడం సెక్షన్. ఇందుకు కారణం పొందుగల వద్ద కృష్ణానదిపై రెండో రైలు వంతెనని నిర్మించాల్సి ఉంటుంది. అంతేకాకుండా విష్ణుపురం వద్ద తెలంగాణ ప్రభుత్వం భారీ విద్యుత్ ప్లాంట్‌ని నిర్మిస్తున్నది. అక్కడ ఒక ఆర్‌వోబీ నిర్మాణం కూడా చేపడుతున్నది. కృష్ణానదిపై వంతెన నిర్మాణం అంటే అంత సులభతరం కాదు. అర కిలోమీటర్ పైగానే పొందుగల వద్ద కృష్ణానది వెడల్పు ఉన్నది. ఏటా వర్షాకాలంలో భారీగా వరదనీరు సాగర్ జలాశయం నుంచి విడుదల జరుగుతున్నది. ఈ నేపథ్యంలో వరదల సమయంలో పనులకు ఆటంకం కలిగే ప్రమాదం ఉన్నది. అయినప్పటికీ కాలపరిమితిని 30 నెలలుగానే రైల్వే శాఖ నిర్ణయించింది.



2029 లోపే పూర్తి చేసే దిశగా అడుగులు

గుంటూరు - బీబీనగర్ రైలుమార్గం రెండు వరసలుగా అప్‌గ్రేడ్ చేసే పనులను 2029వ సంవత్సరం లోపే పూర్తి చేసేందుకు రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకొని ఆ దిశగా ముందుకు సాగుతున్నది. అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాల సహాయంతో ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియని కూడా ఇప్పటికే మొదలు పెట్టించింది. మరో రెండు, మూడు నెలల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశాలున్నాయి. అప్పుడు అన్ని సెక్షన్లలో పనులు ప్రారంభమౌతాయని అధికార వర్గాలు తెలిపాయి. ఏది ఏమైనా ఈ ప్రాజెక్టు పూర్తి అయితే గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా రైళ్లు, సరుకు రవాణ చేసే గూడ్స్‌ల రాకపోకలు పెరిగి ఆదాయం రెట్టింపు అవుతుంది. అంతేకాకుండా గుంటూరు - సికింద్రాబాద్ మధ్యన ప్రయాణ సమయం నాలుగు గంటల కంటే తక్కువ సమయానికి తగ్గిపోతుంది.

నిబంధనలకు పాతరేస్తూ.. ఇసుకను దోచేస్తూ..

- గుండ్లకమ్మ నదీ పరీవాహక ప్రాంతంలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ట్రాక్టర్లు, టర్బోల సాయంతో లక్షలు వెనకేసుకుంటున్న వైనం
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- పట్టించుకోని అధికారులు

వినుకొండటౌన్,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వినుకొండ నియోజకవర్గంలో గుండ్లకమ్మ నదీ పరీ వాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. నిబంధనలకు పాతరేస్తూ, ఇసుకను దోచేస్తున్నారు. వినుకొండ పట్టణంలో రియల్ ఎస్టేట్ అమాంతంగా పెరగడంతో ఇసుక అక్రమాలకు పాల్పడుతూ లక్షలు దండుకుంటున్నారు.

ప్రభుత్వ అనుమతి లేకుండానే అక్రమార్కులు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల సాయంతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగిస్తూ లక్షల రూపాయలను వెనకేసుకుంటున్నారు. అధికారులు చేతివాటం ప్రదర్శించడంతో ఇసుకాసురుల పని మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉంది.

నియోజకవర్గంలో గుండ్లకమ్మ నదీ పరీవాహక ప్రాంతమైన గోకనకొండ, ఉమ్మడివరం, జనవేలు, ములకలూరు తదితర గ్రామాల నుండి పెద్దఎత్తున టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. గోకనకొండ సమీపంలోని ప్రాంతంలో వందల ఎకరాల్లో కొందరు ఇసుక ప్రాంతాల్లోని భూములను ఆక్రమించి పొక్లెయిన్ సాయంతో నీటిలో ఉన్న ఇసుకను తోడి జల్లెడుపోసి ట్రాక్టర్లు, టిప్పర్లు సహాయంతో విక్రయాలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో ఇసుకకు మంచి డిమాండ్ ఉంది. దీంతో, టన్నుల కొద్దీ ఇసుకను తరలించేస్తున్నారు. వాగులు, వంకలను అడ్డాగా చేసుకొని తవ్వకాలు జరుపుతున్నారు. పేదోడి సొంత ఇంటి కలను అక్రమార్కులు ఆసరాగా చేసుకొని ఒక ట్రాక్టరు ఇసుక రూ.3వేల నుండి రూ.3,500 వరకు విక్రయిస్తున్నారు. టర్బో ద్వారా రాత్రి వేళల్లో రూ.20వేలకు పైగా ఇసుకను సుదూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. రాత్రీపగలూ తేడా లేకుండా నిత్యం వేల టన్నులు ఇసుకను తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ, మైనింగ్ పోలీస్ అధికారులు కన్నెత్తిచూసిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారులకు అజ్ఞాత వ్యక్తులు సమాచారం అందించే సమయంలో మాత్రం హడావుడి చేసి తర్వాత అక్కడ ఏమి జరగలేదన్నట్లుగా మిన్నకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా శాఖల అధికారులకు మామూళ్ళు ముడుతున్నాయనే ఆరోపణలూ లేకపోలేదు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ దందా కొనసాగించడంతో భూగర్భజలాలు అడుగంటి నదీపరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. గ్రామాల్లో మళ్లీ ఇదే తంతు మొదలుకావడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి ఆక్రమణకు గురైన ఇసుక మేటలపై కొరడా ఝుళిపించాలని, అక్రమ రవాణకు అడ్డుకట్టువేయాలని ప్రజలు కోరుతున్నారు.



గోకనకొండ గ్రామ సమీపంలోని గుండ్లకమ్మపరివాహక ప్రాంతంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు



గుండ్లకమ్మ నదీపరివాహక ప్రాంతంలో నిల్వచేసిన ఇసుకరాసులు

కొత్త ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలి 6

తప్పులు రహిత ఓటర్ల జాబితా రూపొందించాలి

ఓటర్ల జాబితా పరిశీలకులు సూర్యకుమారి

8



- ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు
- ఏఎన్‌యూలో ప్రారంభమైన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

పోటీతత్వం కన్నా క్రీడా స్ఫూర్తి గొప్పది

సూర్యలంక తీరంలో బీచ్‌వాలీబాల్ పోటీలు

- ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన, కలెక్టరు
- 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు

అంతర్‌జిల్లాల బీచ్‌వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

8



ముగిసిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



ప్రథమ స్థానంలో నిలిచిన రోజా ఎవేంజలినీకు ప్రశంసా పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు, క్రీడల్లో రాణించడం వల్ల విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉంటారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కన్నా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ఉపాధ్యాయులు గుర్తించాలని, వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం ఉంటే గొప్ప శాస్త్రవేత్తలుగా తయారవుతారని అన్నారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముందుగా రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఆధ్వర్యంలో కన్నాను ఘనంగా సన్మానించారు.

'విశాఖ'కు ప్రథమ బహుమతి

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లాకు చెందిన ఎం రోజా ఎవేంజలిన్, ప్రవల్లిక, సాయి ప్రియలకు ప్రథమ బహుమతిని, ద్వితీయ బహుమతి మన్యం జిల్లాకు చెందిన గౌతమ్‌లకు ప్రశంసా పురస్కారం, షీల్డ్‌లతో పాటు మరో 30 మందికి నగదు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గురుకుల కళాశాలల అడిషనల్ సెక్రటరీ కే సునీల్‌రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ సంజీవ రావు, జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ, కళాశాల ప్రిన్సిపల్ జాన్‌సన్, నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి ఉన్నారు.

ప్రకృతి, సాంకేతికతలలో వికృతత్వం లేదు

పెదకాకాని, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి, మారుతున్న సాంకేతికతలలో వికృతత్వం లేదనీ, మనిషి ఆలోచనలలోనే వికృత భావాలు ఉన్నాయని, మనిషి తన మేధస్సును సమాజ హితం కోసం ఉపయోగించాలని ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పాత్రికేయవిద్యా విభాగంలో మంగళవారం 'విలువలతో కూడిన పాత్రికేయం' అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయం అంటే ప్రజా సమస్యలపై పోరాడే పాశుపతాస్త్రం అని అన్నారు. వ్యక్తిగత వికాసానికే కాకుండా, పది మంది పురోగతికీ ఉపయోగపడాలన్న కోరిక ఉన్న వారికి సరైన ఎంపిక పాత్రికేయ రంగ మని వ్యాఖ్యానించారు. పాత్రికేయ రంగంలో గత ఆరు దశాబ్దాలుగా వచ్చిన మార్పులను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లుగా సోదాహరణంగా విశ్లేషించారు. పాత్రికేయ వృత్తిలో ప్రతిభాపాటవాలు చూపితే సమాజంలో పేరుప్రఖ్యాతలు సంపాదించుకోవచ్చని ఫ్రీలాన్స్‌గా కూడా పని చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. జర్నలిస్టులకు సామాజిక బాధ్యత తప్పనిసరిగా ఉండాలని, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా భావించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగని మనస్తత్వం అవసరం అని మంచి వార్తలు, వార్తల్లోని జీవన స్థితి గతులను గుర్తించే నేర్పు ముఖ్యం అని సూచించారు. కార్యక్రమంలో పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతి ర్మయి, టీవీ అండ్ ఫిల్మ్ కోర్సుల సమన్వయకర్త ఆచార్య జే మధుబాబు, అధ్యాపకుడు ఎం మాణిక్యరావు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 586.80 అడుగులు ఉంది. ఇది 304.46 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3431 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20,787 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 36,918 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 36,918 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది




ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి, దివ్యాంగుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ

- అర్జీదారుల సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి హామీ

తాడేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ 47వ రోజుకు చేరుకుంది. ఉండవల్లి కరకట్ట వద్ద లోకేశ్ నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అర్జీదారులు భారీగా విచ్చేసి తమ సమస్యలు విన్నవించారు. అందరి విజ్ఞప్తులను పరిశీలించిన లోకేశ్, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా సంబంధిత శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తానని లోకేశ్ భరోసా ఇవ్వడంతో అర్జీదారులు సంతోషపడ్డారు. దివ్యాంగుల నుంచి కూడా వినతిపత్రాలు స్వీకరించిన లోకేశ్, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కమీషన్ ఏజెంట్ లైసెన్స్‌లు మంజూరుకు వినతి

గుంటూరులోని ఎన్టీఆర్ అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ (గుంటూరు మిర్చియార్డు)లో కమీషన్ ఏజెంట్ లైసెన్స్‌లు మంజూరు చేయాలని టీ లక్ష్మారెడ్డి, షేక్ చినబాజి, విజ్ఞప్తి చేశారు. 2018లో కుటుంబ జీవనోపాధి కోసం కొంతమందికి మిర్చి వ్యాపారం చేసుకునేందుకు కమీషన్ లైసెన్స్ మంజూరు చేసేందుకు అప్పటి పాలకవర్గం యార్డు సెక్రటరీ తీర్మానం చేశారని, అనంతరం వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఉద్యోగావకాశం కల్పించండి

తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన తండ్రి గుండెపోటుతో 2006లో మరణించారని, అన్ని అర్హతలు ఉన్న తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పించాలని నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన సరికొట్టి సాయి సునీత విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ కళాశాల సూపరింటెండెంట్ లైంగిక వేధింపులు

తనను లైంగికంగా వేధించిన తణుకు ఎస్‌సీవీఎం ప్రభుత్వ కళాశాల సూపరింటెండెంట్ కేవీఎస్ రాజేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కళాశాలలో ఉద్యోగిగా పని చేస్తున్న ఓ మహిళ ఫిర్యాదు చేశారు. సూపరింటెండెంట్‌పై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, తనను అక్రమంగా బదిలీ చేశారని, న్యాయం చేయాలని కోరారు.

విలువైన భూములు ఆక్రమించారు

తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులమనే కక్షతో గత వైసీపీ పాలనలో తమపై అక్రమంగా కేసులు నమోదు చేయడంతోపాటు విలువైన తమ భూములు ఆక్రమించు కున్నారని సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం రెక్కమానుకు చెందిన కేసుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి దురాగతాలతో తాము ఊరి విడిచి వెళ్లాల్సి వచ్చిందని, అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు.

భూములు కోల్పోయాం.. న్యాయం చేయండి

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని కడప జిల్లా, యర్రగుంట్ల మండలం, ఇండ్లసిద్దాయపల్లె భూనిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు.

స్థలం ఆక్రమించి నిర్మాణాలు

నెల్లూరు జిల్లా ముత్తుకూరులో తమ 320 చదరపు గజాల స్థలాన్ని ఏ శ్రీనివాసులురెడ్డి కుటుంబం ఆక్రమించిందని, విచారణ చేసి న్యాయం చేయాలని పూడిపర్తికి చెందిన ఇందిరమ్మ విజ్ఞప్తి చేశారు. న్యాయస్థానంలో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా, దౌర్జన్యంగా తమ స్థలంలో నిర్మాణాలు చేశారని, పోలీసులు పట్టించుకోలేదని న్యాయం చేయాలని కోరారు.

కొత్త ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలి

- ఓటర్ల జాబితా పరిశీలకులు సూర్యకుమారి
- తప్పులు రహిత ఓటర్ల జాబితా రూపొందించాలి



సమావేశంలో శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా అబ్జర్వర్ సూర్యకుమారి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, తప్పులు లేని ఓటర్ల జాబితాలను రూపొందించేందుకు కృషి చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా పరిశీలకులు సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాల సవరణలపై కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు. జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సూర్యకుమారి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమని, దోష రహిత ఓటర్ల జాబితాను రూపొందించేందుకు పకడ్బందీగా పరి శీలించాలని అన్నారు. రానున్న నెల రోజుల్లో ఓటర్ల జాబితాల రూప కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి, ఇందుకు బీఎల్‌ఓ, ఈఆర్‌ఓలు సమా వేశం నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 18-20 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతను ముఖ్యంగా డిగ్రీ కళాశాల విద్యార్థులను నూతన ఓటర్లుగా నమోదుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితా తయారీ సమయంలో ఈపీ రేషియో, జెండర్ రేషియో అం శాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించుకోవాలని, ఓటరుగా నమోదు, సవరణకు అరు లైన వారు ఫారం 6, 7, 8 దరఖాస్తు ఫారాలను భర్తీ చేసి అందజేయాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయపక్షాల ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడూతూ జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజవర్గాల్లో ఓటరు జాబితాకు సంబంధించి అక్టోబరు 29 నాటికి 17,35 365 మంది ఓటర్లుగా నమోదయ్యారని, వారిలో 8,46,793 మంది పురుషులు ,8,88,385 మంది మహిళలు, 187 మంది ఇతరులు ఉన్నట్లు వివ రించారు. జిల్లాలోని 1932 పోలింగ్ స్టేషన్లను పరిశీలించామని, 2025 ఓటర్ల జాబితా సవరణలో భాగంగా నవంబరులో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. డిసెంబరు 24 నాటికి అభ్యంతరాలను పరిష్కరించడం పూర్తిచేస్తామని, తుది జాబితాను 2025 జనవరి 6న ప్రకటించడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఆర్‌వో ఐమురళి తదితరులు పాల్గొన్నారు.

నా జీవితానికి మా నాన్నే స్ఫూర్తి

- ఆయన చూపిన బాటలోనే పయనిస్తున్నాం
- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమల రావు
- వేడుకగా సిహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహిత్య విమర్శ పురస్కారాల సభ



పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, జీఎస్ చలంతో డీజీపీ ద్వారకా తిరుమలరావు తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉన్నత స్థాయిలో ఎదగడానికి మా నాన్న అందించిన జీవిత విలువలు అమూల్యమైనవని, ఉద్యోగంలో, జీవితంలో ఆయన చూపిన బాటలోనే పయనిస్తున్నానని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై మంగళవారం జరిగిన సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహిత్య విమర్శ పురస్కారాల సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తన చిన్నతనంలోనే తన తండ్రి పదవీ విరమణ పొందారని అన్నారు. ఆయన నిరాడంబరంగా జీవించారని, సమర్థతతో పాటు, నీతి నిజాయితీలకు లోబడి పనిచేశారని గుర్తుచేశారు. ఆయన పేరుతో అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న అవార్డుల ప్రక్రియ వెనుక తన సోదరి సుశీలమ్మ చేస్తున్న కృషి గొప్పదన్నారు. అవార్డులను స్వీకరిస్తున్న పాపినేని శివశంకర్, జీఎస్ చలంను అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ మాట్లాడుతూ సాహిత్య విమర్శకులను గుర్తించి, గౌరవించడం సామాజిక బాధ్యతగా భావించి గత ఐదేళ్లుగా ప్రముఖులకు తమ తండ్రి పేరున పురస్కారాలు అందజేస్తున్నట్లు వివరించారు. పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, జీఎస్ చలం మాట్లాడుతూ కవిత్వానికి, కథకు పురస్కారాలు ఇస్తారు కానీ సాహిత్య విమర్శకు అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి పురస్కారాలతో మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. అనంతరం 2023 సంవత్సరానికి పాపినేని శివశంకర్‌కు, 2024 సంవత్సరానికి ప్రముఖ విమర్శకు రచయిత చలంకు డీజీపీ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎక్సైజ్ కమిషనర్ అహమద్ షరీఫ్, డాక్టర్ ఓ వీ రమణ, డాక్టర్ వీవీ రామకుమార్, పలు రచయితలు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో కార్తీక వన సమారాధన

- వన భోజనాల్లో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు



గుంటూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు ఎక్కడున్నా మన సంస్కృతి, సంప్ర దాయాలకు పెద్దపీట వేస్తూనే ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి, ప్రతి కుటుంబం శ్రద్ధా భక్తులతో జరుపుకునే కార్తీక వన సమారాధన సువాసనలు జపాన్‌లోనూ వ్యాపించాయి. జపాన్‌లో నివాసం ఉంటున్న తెలుగు ప్రజలు టోక్యోలోని ఓజీమాకు వచ్చి కార్తీక వనసమారాధన జరుప ుకున్నారు. ఈ సందర్భంగా పురుషులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆటాపాటలతో తెలుగు వారి ఐక్యతను చాటారు. చివరిలో పసందైన విందు భోజనంతో వన దేవతకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల తెలుగు ప్రజలందరూ పాల్గొన్నట్లు జపాన్ తెలుగు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రతి తెలుగు పండుగ జపాన్‌లో జరుపుకుంటునట్లు పేర్కొన్నారు. మన సంస్కృతీ సంప్రదాయం, ముఖ్యంగా పండుగ రోజు కనిపించే వస్త్రధారణ అక్కడి ప్రజలను అమితంగా ఆకట్టుకుంటాయని తెలిపారు.



ఫిట్‌నెస్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఐజీ త్రిపాఠి

ఎస్సై ఉద్యోగోన్నతులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సై ఉద్యోగోన్నతుల కోసం నిర్వహించిన పరీక్షలను సౌత్ కోస్టల్ జోన్ రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్ పకడ్బందీగా నిర్వహించారు. రెండవ రోజు మంగళవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ కమాండెంట్ ఎస్పీ నగేష్ బాబు, ప్రకాశం జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గుంటూరు రేంజ్ పరిధిలోని 5 జిల్లాలు గుంటూరు, ప్రకాశం బాపట్ల, నెల్లూరు, పల్నాడులలో పనిచేస్తున్న 58 మంది ఎస్సై స్థాయి ఉద్యోగోన్నతి కోసం ఔట్ డోర్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షార్థులకు సీట్ టర్న్ అవుట్, ఫుట్ డ్రిల్, వెపన్ డ్రిల్, వెపన్ హ్యాండ్లింగ్, మార్చ్ పాస్ట్, నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ మొదలగు వివిధ అంశాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు.

పంచాయతీ సెక్రటరీ వేధింపులు తాళలేక మరణిస్తున్నా..

- తాళ్లపల్లి సచివాలయ సర్వేయర్ యేసురాజు సెల్ఫీ వీడియో



సెల్ఫీ వీడియో చేస్తున్న సర్వేయర్ యేసురాజు

మాచర్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సెక్రటరీ తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆ వేధింపులు తట్టుకోలేక చనిపోతున్నానని సచివాలయ సర్వేయర్ సెల్ఫీ వీడియో కలకలం రేపుతుంది. వివరాలు ఇలా వున్నాయి. పల్నాడు జిల్లా మాచర్ల మండలంలోని తాళ్లపల్లి పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న అవుల వెంకట్రామయ్య తనను వేధిస్తున్నారని, ఆ వేధింపులు తాళలేక మరణిస్తున్నానని అదే గ్రామ సచివాలయ సర్వేయర్ యేసురాజు సెల్ఫీ వీడియో చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతూ కలకలం రేపుతోంది. గ్రామ సమీపంలోని సాగర్ కుడికాలువ వద్ద మంగళవారం ఈ సెల్ఫీ వీడియో చేశారు. తన పేరు యేసురాజు అయినప్పటికీ తాను యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినని, అయితే నువ్వు మాదిగ కులానికి చెందిన వాడవురా.. నేను చెప్పినట్టు నువ్వు వినాలి.. నా కాళ్ల బూట్లు తుడవాలి అంటూ వెంకట్రామయ్య వేధిస్తున్నారని యేసురాజు తన సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. పంచాయతీ సెక్రటరీ వెంకట్రామయ్య వేధింపులు తాళలేక మరణిస్తున్నానని, ఈ వీడియోనే తన మరణ వాంగ్మూలంగా భావించాలని ఆ వీడియోలో యేసురాజు చెప్పారు. కాగా వీడియో అనంతరం యేసురాజు కనిపించడం లేదు. దీనిపై మాచర్ల రూరల్ పోలీసులను వివరణ కోరగా విచారిస్తున్నట్లు చెప్పారు.

సోషల్ మీడియాలో దూషణలపై రిమాండ్

- నిందితుల జాబితాలో మాజీ ఎమ్మెల్యే కిలారి

పొన్నూరుటౌన్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబ సభ్యులను సోషల్ మీడియా వేదికగా అసభ్య దూషణలకు, అసత్య ప్రచారానికి పాల్పడ్డ వైసీపీ కార్యకర్త షేక్ గోపిలాల్‌ను రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేయగా కోర్టు రిమాండ్ విధించింది. 2020వ సంవత్సరంలో ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉన్నారని, అక్రమంగా భూములు కొనుగోలు చేశారని, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేశారు. ఈ విషయమై 2020లోనే నరేంద్ర కుమార్ కటుంబ సభ్యులు సాక్ష్యాలతో సహా రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలో దీనిపై విచారణ చేపటట్టలేదు. పోలీసులను నరేంద్రకుమార్ ప్రశ్నించినప్పటికీ వారి నుంచి సమాధానం కరువైంది. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్న వారిపై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుండటంతో ఈ కేసు వెలుగు చూసింది. రూరల్ ఎస్సై గండు కిరణ్ ఈ కేసు విచారణను తిరిగి ప్రారంభించి, ప్రధాన నిందితుడిగా పెదకాకాని మండలానికి చెందిన షేక్ గోపిలాల్‌ని అరెస్టు చేశారు. ఈ అసత్య ప్రచారాలు సాగించమని కీలక వైసీపీ నాయకులు తనకు బాధ్యతలు అప్పగించారని పోలీసుల విచారణలో గోపిలాల్ వెల్లడించటంతో మరో 12 మందిని ఈ కేసులో నిందితులుగా రూరల్ పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలువురు వెసీపీ నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈ కేసులో తాజా మాజీ ప్రజా ప్రతినిధి కిలారి వెంకట రోశయ్య కూడా నిందితుడిగా ఉనట్లు సమాచారం. కిలారి ప్రోద్బలంతోనే ఈ అసత్య ప్రచారం సాగించినట్లు గోపిలాల్ విచారణలో వెల్లడించినట్లు సమాచారం. దీనిపై రూరల్ ఎస్సై కిరణ్‌ను వివరణ కోరగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఒక నిందితుడిని అరెస్టు చేశామని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్లరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలోని హైవేపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఇసుకపల్లికి చెందిన నీలం శ్రీనివాసులు (32) తన ద్విచక్రవాహనంపై రేపల్లె నుండి ఒంగోలుకు వెళుతుండగా బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలోని హైవేపై వెళుతున్నాడు. వేగంగా ద్విచక్రవాహనం నడుపుతుండగా అదుపు తప్పి ఎదురుగా ఉన్న టాటా ఏస్ ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఈ మేరకు రూరల్ పోలీసులకు సమాచారం అందించటంతో క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ కె.గంగాధరరావు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శివన్నారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్నఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్

పిట్టలవానిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని రజకపాలెం గ్రామానికి చెందిన మేత్ర శివన్నారాయణ (56) సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత బేధాభిప్రాయాల కారణంగా తన భార్యా పిల్లలు నుంచి వేరుబడి జీవిస్తున్న శివ న్నారాయణ, కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమ వారం రాత్రి తన స్వగృహంలోని ఇంటికప్పుదూలానికి శివన్నారాయణ ఉరివేసుకున్నాడు. శివన్నా రాయణ అన్న కుమారుడు మేత్ర ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్లు చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు.

అర్ధరాత్రి కోడి పందేలు

- గాజుల్లంక ఇటుక కల్లాల్లో ..
- పోలీసుల రాకతో పారిపోయిన పందెంరాయుళ్లు

కొల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి భారీ స్థాయిలో కోడిపందేల బరిలు ఏర్పాటు చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేయడంతో పందెంరాయుళ్ల పరారయ్యారు. మండల పరిధిలోని గాజుల్లంక ఇటుక కల్లాల్లో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో డీజే వాయిద్యాలతో కోడి పందేలు వేసేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. భారీ స్థాయిలో కోడి పందేలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ ఏడుకొండలు సిబ్బందితో కలిసి ఆ స్థావరంపై ఆకస్మిక దాడులు నిర్వ హించారు. దీంతో పందెం రాయుళ్ల పరారయ్యారు. నలుగురు వ్యక్తులను, ఒక కారు, ఆరు ద్విచక్ర వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కోడిపందేల బరిని గాజుల్లంకకు చెందిన మత్తి నరేంద్ర అనే వ్యక్తి ఏర్పాటు చేశాడని సమాచారం ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. అతనిని కూడా అదుపులోకి తీసుకోనున్నట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.95
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111.119.130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

46,945 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 49,829 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,945 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 36,376 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	14000
నెంబరు. 5	8000	14000
273	8000	9000
341	9000	14000
4884	10500	10500
సూపర్ 10	12000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16300
బ్యాడిగి	7500	12500
దేవనూరు డీలక్స్	8500	14000
తెల్లకాయలు	4500	11000

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	13000
నెంబరు.5	8500	12000
273	—	—
341	10000	14500
4884	8000	12000
సూపర్ 10	13300	13300
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16500
బ్యాడిగి	9500	12500
దేవనూరు డీలక్స్	9000	14500
తెల్లకాయలు	4500	10000

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు

16 రేషన్ షాపులకు నోటిఫికేషన్ విడుదల

నకరికల్లు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు మండలంలో ఉన్న 16 నిత్యావసర చౌకధరల దుకాణాలకు ఆర్డీవో నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు తహసీల్దార్ కే పుల్లారావు తెలిపారు. నకరికల్లు 02, 03 షాపులకు, శివాపురం తండాలో 06, చల్లగుండ్లలోని 07, 08, గుండ్లపల్లి 014, నరసింగపాడు 016, చాగల్లు 024, దేచవరం 026, రూపెనగుంట్ల 029, కుంకలగుంట 032, 036, 037, చేజర్ల 038, అడ్డరోడ్డు 042 చౌక ధరల దుకాణాలకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కే పుల్లారావు కోరారు. దరఖాస్తు దారులకు డిసెంబరు 9న రాత పరీక్ష, 11వ తేదీన భౌతిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాలకు నకరికల్లు తహసీల్దార్ కార్యాలయాన్ని గానీ, సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాన్ని గానీ సంప్రదించాలన్నారు.

విధుల్లో అలసత్వం వీడాలి

● ఎంపీడీవో రామచంద్రరావు



జానపాడు సచివాలయంలో సిబ్బందిని వివరాలు అడుగుతున్న ఎంపీడీవో రామచంద్రరావు

పిడుగురాళ్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సచివా లయ ఉద్యోగులు సమయపాలన పాటించకుంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. సోమవారం జానపాడు-1, 2 సచివాలయాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. కొంత మంది ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించి హెచ్చరించారు. అనంతరం ఇంటింటి సర్వే, ఎన్‌పీ సీఐఐ లింక్‌ను పరిశీలించారు. ముందుగా స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక మాస పూజలో జంగా



పిడుగురాళ్ల శివాలయంలో కార్తీక పూజలో పాల్గొన్న జంగా కృష్ణమూర్తి దంపతులు

పిడుగురాళ్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివాలయంలో సోమవారం కార్తీకమాస అభిషేక, పూజా కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి దంపతులు, పట్టణానికి చెందిన పలువురు మహిళా భక్తులు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత స్వామికి జంగా కృష్ణమూర్తి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జంగాని ఘనంగా సత్కరించారు.

తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నాం

సత్తెనపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీసనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామని ఆశ్రమ మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆశ్రమ స్థలదాత బంధువుగా చెప్పుకుంటున్న కట్టమూరి విజయ వెంకట లక్ష్మీనరసింహారావు ఆశ్రమంలోని కొంత స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆమె తెలిపారు. ఒంగోలు జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో తప్పుడు డాక్యుమెంట్లుగా నిర్ధారిస్తూ వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారన్నారు. స్థలం విషయంలో విద్యా సంస్థపై కొందరితో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దాన్ని ఖండిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 15మందికి గాయాలు

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 15మంది గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున తొట్టంబేడు మండలం జ్ఞానాంబకండ్రిగ సమీపంలోని నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మల్లవరానికి చెందిన శ్రీనునాయక్ వ్యాపారి. ఆయన కుటుంబసభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు సోమవారం వ్యానులో బయలుదేరారు. జ్ఞానాంబ కండ్రిగ వద్ద బెంగళూరు నుంచి నాయుడుపేట వైపుగా వెళుతున్న టూరిస్టు బస్సు, వ్యాను ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యానులో ప్రయాణిస్తున్న శ్రీనునాయక్, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, సోమ్లు, సైదా, సంజు, జాను, ఆంజనేయులు, దద్దు, జశ్వంత్, మంజుల, రూప, నీల, వెంకటేశ్వర్లు, నవీన్ తదితరులు గాయపడ్డారు. ఇందులో ఆంజనేయులు ఎడమకన్నుకు తీవ్రగాయమైంది. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులు తిరుపతి రుయాకు తరలివెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

జూద స్థావరంపై దాడి

ఐదుగురి అరెస్టు.. రూ.40,020 స్వాధీనం

మాచర్ల రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మాచర్లరూరల్ ఎస్ఐ నారాయణ మంగళవారం తన సిబ్బందితో దాడి చేశారు. కోడి పందాలు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.40,020లతోపాటు రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దుర్గిలో ఆరుగురి అరెస్టు

దుర్గి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో గల పేకాట స్థావరంపై మంగళవారం ఎస్ఐ సుధీర్‌కుమార్ తన సిబ్బంది కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.75,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

మందులు లేవు.. డాక్టర్లు లేరు

- సమయపాలన పాటించని వైద్య సిబ్బంది
- ఏడాదిగా నిలిచిన మందుల సరఫరా
- మందుబాబులకు నిలయాలుగా వైద్యశాలలు
- చెత్తాచెదారంతో నిండిన లోపలి గదులు



చెత్తాచెదారంతో నిండిన వెల్దుర్తి మండలం కండ్లకుంట పశువైద్యశాల



శిరిగిరిపాడు పశువైద్యశాల ఆవరణలో మద్యం బాటిళ్లు

మాచర్లటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గ పరిధిలోని పలు పశువైద్యశాలల్లో మందులు లేవు. డాక్టర్లు లేరు. వెల్దుర్తి మండలంలో 3 పశువైద్యశాలలు, ఒక సబ్‌కేంద్రం ఉంది. డాక్టర్లు తూతూ మంత్రంగా విధులకు వస్తున్నారని, సిబ్బంది ద్వారానే సేవలందుతున్నాయని పశుపోషకులు అంటున్నారు. ఆయా చోట్ల ఏడాదిగా మందుల సరఫరా నిలిచిపోయింది. నెలక్రితం మెడికల్ ఇండెంట్ పెట్టినప్పటికీ ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు తప్పనిసరిగా తెరిచి ఉంచాల్సిన పశువైద్యశాలలు నామమాత్రంగానే తెరుచుకుంటున్నాయి. ఉదయం 9గంటలకు మందాది పశువైద్యశాల మూసివుండగా ప్రజలు సిబ్బంది కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. అలాగే శిరిగిరిపాడు పశువైద్యశాల మందుబాబులకు నిలయంగా మారింది. వైద్యశాల ప్రాంగణంలో మద్యం బాటిళ్ల దర్శనమిస్తున్నాయి. కండ్లకుంటలో పశువైద్యశాల ఉన్నట్లు గ్రామస్థులకే తెలియకపోవడం గమనార్హం. వైద్యశాల భవనాలు తాళాలు వేసి తెరవకపోవడంతో తలుపులు చెదలు పట్టాయి. లోపలి గదుల్లో చెత్తాచెదారం నిండిపోయి పశువుల పాకను తలపిస్తోంది. సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంజక్షన్ వేసినా, మందులు పంపిణీ చేసినా చేతులు తడపాల్సి వస్తోందని పశుపోషకులు చెబుతున్నారు. మాచర్ల మండలపరిధిలో రెండు పశువైద్యశాలలు ఉన్నాయి. మాచర్ల పట్టణంలో వైద్యశాలలో డాక్టరు లేరు. ఏడాదిగా మందులు లేవు. దుర్గి మండలపరిధిలో రెండు పశువైద్యశాలలు ఉన్నాయి. మందులు అందుబాటులో ఉన్నాయి. రెంటచింతల మండలంలో మూడు పశువైద్యశాలలు ఉన్నాయి. మంచికల్లు పశువైద్యశాలలో డాక్టర్ సక్రమంగా రాకపోవడంతో వైద్యం అందడం లేదు. సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పశుపోషకులు ఆరోపిస్తున్నారు. కారంపూడి మండలంలో ఒక పశువైద్యశాల ఉండగా డాక్టర్ లేరు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే యరపతినేని



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పక్కన జంగా కృష్ణమూర్తి తదితరులు

పిడుగురాళ్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గురజాల నియోజక వర్గంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి, అభ్యున్నతికి ప్రభుత్వ పథకాలతో పాటు తన వంతుగా సాయమందించేందుకు సిద్ధంగా ఉన్నానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కొండమోడు సమీపంలోని ముచికుంద మహర్షి ఆశ్రమం వద్ద పిడుగురాళ్ల పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, గతంలోనే బార్బర్ షాపులకు రాయితీతో కూడిన విద్యుత్‌ను అందించామన్నారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నాడన్నారు. అనంతరం నాయీబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యరపతినేని, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు.

రాజ్యాంగాన్ని భారతీయులకు అందించిన మేధావి అంబేద్కర్

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లిలోని టీడీపీ ప్రజావేదికలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

సత్తెనపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్వశ్రేష్ఠమైన రాజ్యాంగాన్ని భారతీయులకు అందించిన ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం టీడీపీ ప్రజావేదికలో కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ శుభాకాంక్షలను ఆయన ప్రజలందరికీ తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, నాయకులు అళ్ల సాంబయ్య, బండారు నాగరాజు, కోమటినేని శ్రీనివాసరావు, పోట్ల ఆంజనేయులు, సయ్యద్ పెద కరీముల్లా, అతుకూరి నాగేశ్వరరావు, అళ్ల అమరేశ్వరరావు, గుంటూరు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

● దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో వేదా కళాశాలలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేద కళాశాల డైరెక్టర్ సూర్య ప్రకాష్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ ఆధ్వర్యంలో.. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తాలూకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు.

● రాజుపాలెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిగూడెం, రాజుపాలెం, కొండమోడు తదితర గ్రామాల్లో రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో జీవి సత్యానారాయణ, ఎంఈవో మల్లికార్జునశర్మ, వ్యవసాయ సంచాలకులు హనుమంతరావు, ఏవో వెంకటనరసయ్య, టీడీపీ మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ అల్లాబక్షు, నల్లమోతుల శ్రీనివాసరావు(వాసు), పఠాన్ వలి, షేక్ బాబావలి తదితరులు పాల్గొన్నారు.

మాచవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోఆర్డీ వెంగళరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రయోజనాలు కాపాడేది రాజ్యాంగమే : ఎమ్మెల్యే ప్రవీణ్



గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు

పెదకూరపాడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను కాపాడేది రాజ్యాంగమేనని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పుర స్కరించుకుని బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పెదకూరపాడులో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం, జన చైతన్య సమితి ఆధ్వర్యంలో జరిగిన రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవంలో తహసీల్దార్ దానియేలు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో ఏకుల ప్రసాదరావు, జనచైతన్య సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించినట్లు బీసీ యువనాయకులు తిరువాయిపాటి ఆంజనేయులు మంగళవారం తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● క్రోసూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోను, పాఠశాలల్లోను రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహేష్‌బాబు, ఎంపీపీ కోటయ్య, ఈవోఆర్డీ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో.. మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మాచర్లటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన పట్టణంలోని పార్కు సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, డివిజన్ ఇన్‌చార్జి అప్పారావు, ఎంసీపీఐయూ డివిజన్ కార్యదర్శి మాచవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వీరభద్రాపురం మండల పరిషత్ పాఠశాలలో, పట్టణంలోని ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

● రెంటచింతల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం దేశానికి దిక్సూచి లాంటిదని గిరిజన సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ మోహన్ అన్నారు. పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో ఎంపీడీవో కెసరజని, ఎంఈవో శివనాగేశ్వరరావు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● దుర్గి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో మంగళవారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యాన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ వడ్డె మధుసూదనరావు, తిప్పాబత్తుల రాణి, వెంకటకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాజేష్‌నాయక్, మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, ఏపీవో కోటిరెడ్డి, వెలుగు సీసీ మల్లేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసంబంధిత విషయాల్లో అవకతవకలకు పాల్పడవద్దు

● కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

గురజాలటౌన్, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): రెవెన్యూ అధికారులు, సిబ్బంది భూ సంబంధిత విషయాల్లో అవకతవలకు పాల్పడవద్దని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీ దారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. పౌర సరఫరాలశాఖ ద్వారా అందించే రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. గురజాల డివిజన్ పరిధిలో ప్రభుత్వ భూములున్నాయని, పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. గుత్తికొండ బిలం, దైద వంటి క్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. నాగార్జునసాగర్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని మెరుగుపరచాలన్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఆర్డీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో బోటింగ్ పాయింట్ ఏర్పాటు

● హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజుల



గుంటూరు శిల్పారామంలో పర్యటిస్తున్న హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ చేర్రెడ్డి మంజుల

గుంటూరు సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని శిల్పారామంలో బోటింగ్ పాయింట్, కన్వెన్షన్ హాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు వెంటనే చేపడతామని ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజుల వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఆమె గుంటూరు శిల్పారామంను సందర్శించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. శిల్పారామంలోని ఆర్టీజన్ స్టాల్స్ సందర్శించి వారితో మాట్లాడి కళలు, కళాకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు వురికి ముఖ్యమంత్రి సహాయనిధి నగదు మంజూరు కాగా సంబంధిత బాధిత కుటుంబాలకు స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంగళవారం గుంటూరులోని తన కార్యాలయంలో పంపిణీ చేశారు. పెదకూరపాడు గ్రామానికి చెందిన పీ వెంకటేశ్వర్లుకు రూ.2లక్షలు, బీ వెంకట్రావుకు రూ.73,772, డీ విమలకు రూ.1,08,600, షేక్ నల్లాకు రూ.20వేలు, ఎం వైదేహికి రూ.1,84, 716, తాళ్లూరుకు చెందిన టీ రామకృష్ణకు రూ.2,17,200, సీహెచ్ ఆదిరెడ్డికి రూ.2,17,200, ఎం సాంబయ్యకు రూ.2,17,200, జీ కృష్ణారెడ్డికి రూ.73,889, షేక్ ఖుష్బుకు రూ.49492, గారపాడుకు చెందిన కే సైదారావుకు రూ.25,000, కాశిపాడుకు చెందిన సీహెచ్ ఏకాంత్ రూ.15,000 మంజూరయ్యాయి. మంజూరు పత్రాలతో పాటు నగదు చెక్కులను ప్రవీణ్ అందజేశారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు బీ రామగోపాలరావు, పీ రామారావు, వడ్లమూడి అప్పారావు, భాష్యం ఆంజనేయులు, ఎం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాచర్లకు దక్కిన అరుదైన గౌరవం

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి



చేర్రెడ్డి మంజులారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న జూలకంటి బ్రహ్మనందరెడ్డి

రెంటచింతల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలు సైన్యం లాంటి వారని ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా యుద్ధ భూమి నుంచి వెనుతిరగరని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తెలిపారు. గొడ్డలి దెబ్బలను ఎదిరించి పోరాడిన వీర వనిత చేర్రెడ్డి మంజులారెడ్డికి రాష్ట్రస్థాయి చైర్మన్ పదవి దక్కడమంటే మాచర్ల నియోజకవర్గ కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినట్లేనని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం విజయవాడ లయోలా కళాశాల సమీపంలోని శిల్పారామంలో హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన చేర్రెడ్డి మంజులారెడ్డి ప్రమాణ స్వీకారానికి జూలకంటి దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు తనకు అండగా ఉండి ముందుకు నడిపించారని.. అదే నన్ను విజయతీరాలకు చేర్చిందని అన్నారు. నూతన చైర్మన్ మంజులారెడ్డిని జూలకంటి దంపతులతోపాటు కూటమి నేతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి తరలివెళ్లిన వారిలో టీడీపీ మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జి.నుమంత్‌రెడ్డి, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బి.రామకృష్ణ, మొండెద్దు శౌరెడ్డి, ఎం రాయపరెడ్డి, సిద్దయ్య, ఇన్నారెడ్డి, మాజీ సర్పంచ్ చేర్రెడ్డి కోటిరెడ్డి, పాలువాయి సర్పంచ్ ఎం హనిమిరెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్ నర్సిరెడ్డి, రైతు విభాగం నేత అల్లం బ్రహ్మారెడ్డి, ఎం కిరణ్, పేరం సర్వారెడ్డి తదితరులున్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వాలు

దాచేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. దాచేపల్లి నగర పంచాయతీ, గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి టీడీపీ కార్యకర్తలు, అభిమానులతో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్కరికి ప్రమాదబీమా వర్తిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలంతా పాల్గొని రికార్డు స్థాయిలో సభ్యత్వాలు చేయాలని సంకల్పించారు.

నాగిరెడ్డిపాలెంలో..

బెల్లంకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెంలో మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతుంది. ఇప్పటికే గ్రామంలో ఐదు వందలపై చిలుకు సభ్యత్వం నమోదు చేసినట్లు సీతారామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదును వేగవంతం చేసి నట్లు తెలిపారు.

సత్తెనపల్లి మూడో వార్డులో..

సత్తెనపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ వార్డులో మంగళవారం రాత్రి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు పాల్గొని పలువురికి టీడీపీ సభ్యత్వాన్ని అందించారు. కార్యక్రమంలో మార్కెట్ రాజు, పురుషోత్తం నాయక్, గుంటూరు ఆశీర్వాదం తదితరులున్నారు.

క్రిస్మస్‌ని ఆహ్వానిస్తూ క్యాండిల్స్ ర్యాలీ



ఏఈఎల్‌సీ చర్చి ఆధ్వర్యంలో జరిగిన క్యాండిల్స్ ర్యాలీ

క్రోసూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని ఏఈఎల్‌సీ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ కాలాన్ని ఆహ్వానిస్తూ క్రైస్తవులు క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు ఈ లోకానికి నవతారగా జన్మించాడని, ఆయన జననంతో ఈ లోకానికి గొప్ప వెలుగు వచ్చిందని పాస్టర్ మాచర్ల సుందరరావు తెలియజేశారు. చర్చి నుంచి భారీ స్టార్‌ను ఊరేగింపుగా తీసుకు వచ్చి క్రోసూరు గ్రామకూడలిలో ఏర్పాటు చేశారు. వందలాది మంది క్రైస్తవులు ఈ సందర్భంగా ప్రత్యేక గీతాలు ఆలపించారు.

అధికారుల సూచనలు పాటించాలి

బెల్లంకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించినట్లయితే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చునని ఏవో కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని నందిరాజుపాలెం, న్యూ చిట్యాల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సచివాలయంలో ఎంపీడీవో తనిఖీ

గురజాలటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాడుగుల సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో గౌసియాబేగం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అని. రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జయరాంనాయక్, పంచాయతీ సెక్రటరీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో కమిషనర్ పరిశీలన

పిడుగురాళ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కట్టెల అడితిల సెంటర్లో ఉన్న అన్న క్యాంటీన్‌ను సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ పరిశీలించారు. పదార్థాలను రుచి చూసి అక్కడున్న వారిని ఆహారం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్మికులు చూడాలని అన్నారు.

దమ్ము ట్రాక్టర్లపై కేసులు పెట్టండి..

రెంటచింతల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రహదారులను ఛిద్రం చేస్తున్న దమ్ము ట్రాక్టర్ల డ్రైవర్లపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి ఆగ్రహం అనే శీర్షికతో ఈనెల 23న ఆంధ్రజ్యోతి మినీలో ప్రచురితమైన వార్తకు స్పందన ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ డీఈ రమణయ్య, ఏఈఈ యూనస్‌లకు దమ్ము ట్రాక్టర్లతో రోడ్డు ఎక్కితే కేసులు నమోదు చేయాల్సిందిగా ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి మంగళవారం ఆదేశించారు. రోడ్ల నిర్మాణానికి కోట్ల రూపాయలు ఖర్చవుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని ప్రశ్నించినట్లు సమాచారం. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పరిసరాల నుంచి వచ్చిన దమ్ము ట్రాక్టర్ల నిర్వాహకులు రోడ్లను నాశనం చేయొద్దని కోరారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జోన్ డైరీ

● గురజాల మండలంలోని దైద బిలం అమ రలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద బస్సు షెల్టర్ ప్రారంభం

● మాచవరం మండలంలోని అన్ని సచివాలయాల్లో ఈనెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఆధార్ క్యాంపుల ఏర్పాటు

జాతీయస్థాయి అండర్ - 14 ఖోఖో జట్ల వివరాలు

కారంపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి అండర్ - 14 ఖోఖో బాల, బాలికల జట్ల వివరాలను మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ సురేష్, అబ్జర్వర్ పట్టాభిరామ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వర్ణరాజులు వెల్లడించారు. కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను జాతీయస్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. బాలుర విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎం కేశవ, డీ అఖిల్, యూ మనోహర్, ప్రకాశం జిల్లా నుంచి ఏ శ్రీనివాసరావు, జీ సాయిసందీప్, చిత్తూరు జిల్లా నుంచి కే ధనుష్, బీ వినయ్‌కుమార్, విశాఖపట్నం నుంచి ఆర్ తరుణ్, డీ యుగంధర్, కర్నూల్ నుంచి ఆర్ బాలాజీ, ఈస్ట్ గోదావరి నుంచి ఈ ఉమాఅజయ్, కడప జిల్లా నుంచి బీ రాఘవులు జాతీయ జట్టులో స్థానం సంపాదించారన్నారు. బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా నుంచి సీహెచ్ అమృత, జీ లక్ష్మి, జేఎస్ ధనుశ్రీ, శ్రీకాకుళం నుంచి డీ మీనా, ఎం హారిక, విశాఖపట్నం నుంచి ఆర్ శృతిక, ఎం ధనలక్ష్మి, కడప నుంచి జీ హారిక, అనంతపురం నుంచి సీహెచ్ అనిత, ప్రకాశం నుంచి ఎం వర్షిణిరెడ్డి, నెల్లూరు జిల్లా నుంచి ఎస్‌కే గౌస్ ఉన్నీసా జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు.

జాతీయస్థాయి పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు

మాచర్లటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు మత్తె భూపేంద్రకుమార్, విజయలక్ష్మిలు ఎంపికయ్యారు. మంగళవారం ప్రిన్సిపాల్ తుమ్మ సుజాత స్కూల్లో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా అరకొండలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభచూపి జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. డిసెంబరులో మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయిలో పోటీలకు ప్రాతినిత్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు మత్తెకుమార్, ప్రతాప్, సిస్టర్ శ్వేత, సంతోష్, రత్నప్రకాష్, వెంకట్, విజేష్ స్వరాజు, ప్రసాద్, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఇలా తగ్గాలి..





- అయోమయంగా వెయిట్ లాస్ పద్ధతి
- ఆహారపు నియమాలు పాటించకపోతే అసలుకే ఎసరు
- బరువు తగ్గినంత మాత్రానా ఆరోగ్యంగా ఉన్నట్టు కాదు
- శరీరంలో కొవ్వు లేకుండా చూసుకోవాలి
- డైట్, వ్యాయామాలతోనే సాధ్యం
- ప్రకటనలపై అప్రమత్తం ఉండాలంటున్న వైద్యులు

ఈమధ్య అందరని వేధిస్తున్న సమస్య అధిక బరువు.. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ ఈ సమస్యతో బాధపడుతున్నారు. కూర్చోని పనిచేయడం, శారీరక శ్రమ అంతగా లేకపోవడం, వ్యాయామంకు దూరమవ్వడం, పోషకాలు లేని ఆహారాన్ని తీసుకోవడం వంటి కారణాలతో ఒబెసిటీ బారిన పడతున్నారు. వంశపారపర్యంగా గాకుండా కేవలం మన నిర్లక్ష్యం వల్ల వచ్చేదాన్నే ఒక విధంగా ఒబెసిటీ అనవచ్చు. అటుపై గుండె సంబంధిత, చక్కెర వంటి వ్యాధులు సహజంగానే శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ సమస్య అన్ని వయస్సుల వారిని వేధిస్తుంది. అందుకే చాల మంది బరువుతగ్గాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కాస్త తగ్గగానే ఆరోగ్యంగానే ఉన్నట్టు భావిస్తుంటారు. కానీ తగ్గించుకోవాల్సింది బరువు కాదని....శరీరంలోని కొవ్వునని నిపుణులు చెబుతున్నారు.ఈ చిన్న తేడాను గమనించలేక అనేక మంది వెయిట్‌లాస్ విధానాన్ని సరైన మార్గంలో చేయలేకపోతున్నారు. ఇలా చేయడం వల్ల అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గుంటూరు(తూర్పు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మనిషికి శారీరకశ్రమను తగ్గించింది. దీంతో ఎక్కువ మంది వయస్సు, శరీరం నిర్మాణంతో సంబంధం లేకుండా అధిక బరువుతో బాధపడుతున్నారు. ఈ బరువుకు కారణం శరీరంలో పేరుకుపోయిన కొవ్వు నిల్వలే... తినే ఆహారంలో పిండిపదార్థాలు, కార్బోహైడ్రేట్లు, ఎక్కువ సార్లు రీఫైనరి చేసిన పదార్థాలు ఉండటమే దీనికి కారణం. అంతేగాక బరువును తగ్గించుకునే క్రమంలో ఆహారపు అలవాట్లను కూడా మార్చుకోరు. దీంతో ఇతర అనారోగ్య సమస్యలను కూడా కొని తెచ్చుకుంటారు. అసలు బరువు తగ్గడం అంటే ఏంటి అనే విషయంపై చాలమందికి అవగాహన ఉండదు. అందుకే బరువును తగ్గిస్తాం అనే ప్రకటనలు చూసి మోసపోతుంటారు. మరి కొంత మంది వ్యాయామం, వాకింగ్ వంటివి చేసి ఆహారపు నియమాలను పాటించరు. వీటి వల్ల తాత్కాలిక ప్రయోజనం ఉంటుంది కాని శాశ్వత పరిష్కారం లభించదని నిపుణులు తెలుపుతున్నారు. వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకున్నప్పుడే ప్రయోజనాలు ఉంటాయని సూచిస్తున్నారు.

డైట్ నియమాలు పాటించాలి

అధిక బరువుతో బాధపడుతున్నవారు ఆహారపు నియమాలను తప్పనిసరిగా పాటించాలి అప్పుడే శరీరంలో ఉన్న కొవ్వును తగ్గించుకోగలుగుతాం. పిండిపదార్థాలు, కార్బోహైడ్రేట్లు, పిల్లలు అయితే జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. ఇది మొత్తం పొట్ట, ఇతర బాగాల్లో పేరుకుపోతుంది. ఇటువంటి కొవ్వును కరిగించా లంటే ప్రొటీన్ ఉన్న ఆహారంతోనే సాధ్యమవుతుంది. దీనినే ప్రొటీన్ డైట్ అని కూడా అంటారు. దీని వల్ల కొవ్వు తగ్గడంతో పాటు, శరీరంలో మజిల్స్ పవర్ (కండరాల శక్తి) శాతంకూడా పెరుగుతుంది. అసలు 80 శాతం డైట్, 20 శాతం వ్యాయామం ఉంటే శరీరంలో కొవ్వును తగ్గించుకోవచ్చుని నిపుణులు సూచిస్తున్నారు.



వర్కవుట్ల తర్వాత ఇవి తినండి...

వర్క్‌షట్ సెషన్ తరువాత స్వల్పకాలవ్యవధిని అనబాలిక్ విండ్‌గా పిలుస్తారు. ఈ సమయంలో వ్యాయామం చేసిన వ్యక్తి కండరాల ఎదుగుదలకు రికవరీకి ప్రొటీన్ ఫుడ్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్కషట్స్ సమయంలో కండరాలు చాలా సున్నితంగా మారతాయి. కొన్నిసార్లు నొప్పిని కూడా కలిగిస్తాయి. ప్రొటీన్లు కలిగిన ఆహారం తింటే కండరాలు శక్తిని పుంజుకుంటాయి.

ఏదో ఒక డైట్ మాత్రమే పాటించాలి

సాధారణంగా వెయిట్‌లాస్ అవ్వాలనుకునే వారు పాలియో డైట్, వేగన్‌డైట్, లో కార్బోడైట్, డ్యూకెన్‌డైట్, అల్ట్రా లో ఫ్యాట్ డైట్, అటికిన్స్‌డైట్, ఇంటర్ మిటెంట్ ఫాస్టింగ్ జోన్, హెచ్‌సీజీ తో పాటు కొన్ని రకాల ప్రొటీన్ డైట్లు పాటిస్తుంటారు. కానీ వీటిలో ఏదో ఒకదానిని మాత్రమే పాటించాలి. అలాగే రోజులో మూడుసార్లు తినే ఆహారాన్ని 5 నుంచి 6 సార్లు తీసుకునేలా చుసుకోవాలి. పిల్స్, ట్యాబెట్స్ ద్వారా బరువు తగ్గించే కొన్ని డైట్‌లు కూడా ఉన్నాయి. అటువంటి వాటికి దూరంగా ఉంటే మంచిది.

ప్రొటీన్ ఏయే పదార్థాల్లో ఉంటుంది

మొలకెత్తిన గింజలు, పొట్టు తీయని పదార్థాలుతో పాటు, చేప, గుడ్డు, చికెన్ వంటి పదార్థాల్లో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. మనిషి సగటు బరువు ఎంత ఉందో అన్ని గ్రాములు ప్రొటీన్ తీసుకుంటే మంచిది, ఉదాహరణకు 50 కేజీలు ఉన్న మనిషి రోజుకు 50 గ్రాముల ప్రొటీన్ శరీరానికి అందేలా చూసుకోవాలి. అలాగే ఆహారాన్ని ఒకేసారి కాకుండా రోజులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. అంతేగాక ఒక రోజుకు మనిషికి 2000 క్యాలరీల శక్తి నిచ్చే ఆహారం అవసరమవుతుంది అనుకుంటే, కేవలం 1500 క్యాలరీల శక్తి నిచ్చే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. మిగిలిన అవసరమైన క్యాలరీలను శరీరంలో ఉండే కొవ్వును కరిగించి శక్తిగా మారేందుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ అవసరానికి మించి క్యాలరీలను తీసుకోంటే అది కొవ్వుగా మారిపోతుంది. అంతేగాక రోజులో చక్కెర పరిమాణం 4నుంచి 5 శాతం మాత్రమే తీసుకోవాలి.

కొవ్వు శాతం ఎలా తెలుస్తుంది ?

ఎక్కువ మంది తమ బరువును తెలుసుకోనే ప్రయత్నం చేస్తూంటారు. కానీ అధిక బరువుతో బాధపడేవారు శరీరంలోని కొవ్వు శాతాన్ని మాత్రమే తెలుసుకోవాలి. బాడీ మాస్ ఇండెక్స్ అనే పరికరం ద్వారా దీనిని తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఇది అన్ని షాపింగ్ మాల్స్, ఆస్పత్రిల్లో అందుబాటులో ఉంది. శరీరంలో 28శాతం లోపు కొవ్వు ఉంటే సాధారణంగా ఉన్నట్టుగా పరిగణిస్తారు. 28-30 వరకు ఉంటే ఓవర్ వెయిట్ అని, 30 -35 ఉంటే ఒబెసిటీ అని, 35కంటే అధికంగా ఉంటే ఓవర్ ఒబెసిటీ గా పరిగణిస్తారు.

తగ్గుతోంది ఏంటి ?

చాలా మంది రెండు వారాల వ్యాయామం, ఇతర చికిత్సల తరువాత 2-5 కేజీల బరువు తగ్గినట్టు కన్పిస్తారు. వాస్తవానికి ఇలా తగ్గేది కొవ్వు కాదు. శరీరంలో ఉన్న నీటిశాతం, మజిల్స్ కరగడం వల్ల ఇలా బరువు తగ్గినట్టు కన్పిస్తారు. డైట్ పాటించకుండా, వెయిట్‌లాస్‌లో సరైన విదానాలు పాటించని వారిలో ఇటువంటి లక్షణాలు కన్పిస్తాయి. ఇటువంటి విదానాలనే కొనసాగిస్తే శరీరంలో కొవ్వు అలానే ఉండి, కండరాలు కరిగి చర్మం లూజుగా మారిపోతుంది. నీటి శాతం తగ్గడం వల్ల స్పృహ తప్పడం, క్లోమ గ్రంది పనిచేయకపోవడం వల్ల చక్కెర వ్యాధితో పాటు, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదముంటుంది. కండరాలు బలహీనమై ఒకేసారి పక్షవాతంకు దారితీసే అవకాశం లేకపోలేదు.

వ్యాయామాలు చేయాలి ?

అధిక బరువుఉన్న చాలా మంది కార్డియో వర్కవుట్‌లు చేస్తూంటారు. కానీ దీనితో పాటుగా మజిల్స్ వర్క్‌షట్ కూడా చేయాలి. అప్పుడే గుండెతో పాటు ఇతర అవయవాలు క్రియాశీలకంగా పనిచేస్తాయి. రోజులో 60 నిమిషాలు తప్పనిసరిగా వ్యాయమం చేయాలి. కండరాలకు వ్యాయామం చేసే సమయంలో జాగ్రత్తలు అవసరం. చేతులు, కాళ్లు, పొట్ట వర్క్ అవుట్‌లు చేసే సమయంలో విడి, విడిగా చేయాలి. అన్ని ఒకేసారీ చేయాలనుకుంటే మజిల్స్ స్టక్ అయ్యే ప్రమాదముంటుంది. అలాగే నడకకు సంబంధించి 7నుంచి 10 వేలు అడుగులు తక్కువగాకుండా చూసుకోవాలి.





80 శాతం డైట్.. 20 శాతం జిమ్



చందు, ఫిటినెస్ ట్రైనర్, న్యూట్రిషియన్- గుంటూరు

జిమ్‌కు వస్తే బరువు తగ్గుతాము అనేది అపోహ మాత్రమే. జిమ్‌తో పాటు మంచి ఆహారం ముఖ్యం. 80శాతం ఆహార నియమాలు పాటిస్తేనే కొవ్వును తగ్గించుకోగలుతాం. మిగిలిన 20 శాతం వ్యాయామం చేస్తే సరిపోతుంది. ఈ మధ్యకాలంలో పిల్లలు కూడా ఒబెసిటీ బారిన పడుతున్నారు. ఆహారంలో సమతుల్యత లేకపోవడమే దీనికి కారణం. అధిక బరువు ఉన్నవారు ప్రత్యేకమైన వ్యాయామాలను చేయాలి.

పౌడర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి



భువన, డైటీషియన్

కొవ్వు తగ్గించడానికి మార్కెట్‌లో లభ్యమయ్యే పౌడర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వీటితో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. పౌడర్ల వాడే ముందు వైద్యులను సంప్రదించాలి. ఉదయాన్నే వెన్నతీసిన పాలు, పచ్చసొన తీసివేసిన గుడ్లు తీసుకోవాలి. గింజధాన్యాలు, పప్పుదినుసులు, చిక్కుడు గింజలు వంటి వాటిలో అధికంగా మాంసకృత్తులు ఉంటాయి. ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. గింజధాన్యాలు పొట్టు తీసుకోకుండా తినాలి. వీటితో పాటు ఉడకబెట్టిన కూరగాయలు తీసుకోవాలి.

మామూళ్ళు.. ఓవర్ లోడ్

(5వ పేజీ తరువాయి)

టిప్పర్ల నుంచి రూ. 2 కోట్లకు పైగా అక్రమ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ బలవంతపు వసూళ్ల నుంచి ఎలా బయట పడాలో అర్థంకాక బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడిగినంతా చెల్లిస్తే కేసులుండవు ..

ఎవరైతే అడిగినంతా ఇవ్వకుంటే వెంటాడి మరీ కేసులు నమోదు చేస్తూ భారీగా జరిమానాలు విధిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.టిప్పర్‌కు అనుమతించిన వాహన బరువు 10టన్నులు కాగా దానిలో 18 టన్నుల వరకు సరుకు రవాణా చేయవచ్చు. అందుకు భిన్నంగా ఆధునిక ఫీచర్లతో వచ్చిన లారీల బరువే 11 టన్నులకు పైగా ఉంటుంది. వాటిలో 30 నుంచి 35 టన్నుల వరకు ఇసుక, కంకర వంటి మెటీరియల్‌ను రవాణా చేయగలుగుతున్నారు. రహదారుల భద్రత దృష్ట్యా ఓవర్‌లోడ్ నిబంధనలు తెచ్చినా అవి అమలు కావడం లేదు. టిప్పర్లకు జీపీఎస్ సౌకర్యం ఉండడంతో, ముడుపులు ఇవ్వని టిప్పర్లు ఎక్కడ తిరుగుతున్నాయో తెలిసి పోతుండడంతో, ఆ వాహనాలను గుర్తించి కేసులు, జరిమానాలు విధిస్తున్నారని, తప్పనిసరి పరిస్థితిలో ముడుపులు సమర్పించుకుంటున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీలు రిపేరుకు వచ్చినా, పనులు లేక కొన్ని రోజులు తిప్పకపోయినా అధికారులు కనికరించడం లేదని యాజమానులు వాపోతున్నారు.

మధ్యవర్తుల హవా..

రవాణా శాఖలో కొందరు చేస్తున్న అక్రమ వసూళ్లలో మధ్యవర్తుల హవా కొనసాగుతోంది. ప్రతి నెల 5వ తేదీ లోపు ముడుపులు చెల్లించాల్సిందే. లేదంటే వెంటనే కేసులు నమోదు అవుతాయి. తమ వద్ద పనిచేస్తున్న కానిస్టేబుళ్లను పురమాయించి, టిప్పర్ యాజమానులలో ఇద్దరు ముగ్గురిని ఎంపిక చేసుకొని వారి ద్వారా మిగతా వారి నుంచి నెలవారీ ముడుపులు వసూలు చేస్తున్నారని తెలిసింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో బరితెగించిన కొందరు అధికారులే, కూటమి ప్రభుత్వంలోనూ వసూళ్ళ వ్యవహారం చక్కబెడుతున్నారని లారీల యాజమానులు వివరిస్తున్నారు.

సూర్యలంక తీరంలో బీచ్ వాలీబాల్ పోటీలు

- ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన, కలెక్టరు
- 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు





క్రీడాకారులు నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే అధికారులు

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పోటీలు యువతలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 68వ అంతర్‌జిల్లాల బీచ్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించారు. క్రీడాకారులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్ బంతిని సర్వీస్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పాయపాలెం పాఠశాల విద్యార్థినీలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రారంభ సభలో కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. యువత ఆరోగ్యం మెరుగు పడటంతోపాటు, క్రీడా నైపుణ్యాలను మెరుగు దిద్దుకోవటానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. టీమ్‌గా పనిచేయటానికి స్ఫూర్తిని నింపుతాయన్నారు. సముద్ర తీరం వెంబడి మంచి ఏర్పాట్లతో పోటీలు నిర్వహించటం సంతోషదాయకమన్నారు. పోటీలలో పాల్గొనేందుకు 13జిల్లాలు నుంచి క్రీడాకారులు రావటం జరిగిందన్నారు. కార్తీకమాసంలో ఇలాంటి పోటీలు ఏర్పాటు చేయటం శుభపరిణామమని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో అంతర్ జిల్లాల పోటీలు నిర్వహించటం సంతోషదాయకమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. అన్నిజిల్లాల క్రీడాకారులు బాపట్లకు వచ్చి బీచ్‌వాలీబాల్ పోటీలలో పాల్గొనటం మంచి పరిణామమన్నారు.సూర్యలంక బీచ్‌ని పరిరక్షించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. కార్తీక మాసంలో సూర్యలంక బీచ్‌లో లక్షల మంది ప్రజలు స్నానాలు ఆచరించటం, పూజలు చేయటం జరుగుతుందన్నారు. గెలుపు, ఓటమిలను ఒకేలాగా స్వీకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం చెప్పారు. ఓటమి పాలైన వారు ఛాలెంజ్‌గా తీసుకొని మరోమారు గెలుపునకు కృషి చేయాలన్నారు. విజేతలైనవారు ఒడిస్సాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని బహుమతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా స్పోర్ట్స్ అథారటీ చీఫ్ కోచ్ కె.పాల్‌కుమార్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి, షేక్.కరీముల్లా, టీడీపీ మహిళా నాయకులు కాగిత నాగభూషణమ్మ, దగ్గుమల్లి రాణి, ఎంఇవో డి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆమె.. ఆదర్శం

- తన పిల్లలను ప్రభుత్వ స్కూల్లో చేర్పించిన ఉపాధ్యాయురాలు
- అభినందించిన రెడ్డిగూడెం గ్రామస్థులు, అధికారులు



ఉపాధ్యాయురాలు సుజాతలక్ష్మిని శాలువాతో సత్కరిస్తున్న గ్రామస్థులు, అధికారులు

రాజుపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంపన్నులు, ఆర్థికంగా కాస్త ఇబ్బందికరంగా లేని వారు ఎవరూ కూడా వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించేందుకు ముందుకు రాకపోవటం చూస్తున్నాం. దాదాపుగా ప్రభుత్వ ఉద్యోగులందరూ ఇదే కోవకు చెందిన వారే. కానీ వీరందరికీ భిన్నంగా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆమె పిల్లలను ఆమె విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించారు. ఇలా ఇతరుల పిల్లలతో పాటు ఆమె పిల్లలకి తానే విద్యాబుద్ధులు చెబుతూ ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయులుగా నిలిచారు.

వివరాలలోకి వెళితే.. రాజుపాలెం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో బిత్రా సుజాతలక్ష్మీ అనే ఉపాధ్యాయురాలు నాలుగు సంవత్సరాల నుంచి విద్యాబోధన చేస్తున్నారు. అదే పాఠశాలలో రెండు సంవత్సరాల క్రితం తన పెద్ద కుమార్తె విశ్వజను నాలుగవ తరగతిలో చేర్పించింది. రెండవ కుమార్తె కృష్ణజను ఒకటవ తరగతిలో చేర్పించింది. ఆరోజు నుంచి నేటి వరకు సుజాతలక్ష్మీ తన ఇద్దరి పిల్లలను తీసుకుని పాఠశాలకు వస్తుంది. ప్రతిరోజు సమయపాలన పాటిస్తూ పది నిమిషాల ముందే పాఠశాలకు చేరుకుంటుంది. ఈ విషయం గమనించిన గ్రామస్థులు భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం రోజున ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎంఈవో మల్లికార్జున శర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, నల్లమోతుల శ్రీనివాసరావు(వాసు), షేక్ అల్లాబక్షు తదితరులు ఉపాధ్యాయురాలును అభినందించారు. ఈ సందర్భంగా సుజాతలక్ష్మీ మాట్లాడుతూ 'నా పిల్లలు కూడా ఇక్కడ చదువుకోవటం వలన ఎలా చదువుతున్నారో తెలుసుకునే అవకాశం ఉంది. దాంతో నేను సాయంత్రం ఇంటికి ప్రశాంతంగా, సంతృప్తికరంగా వెళ్తున్నాను' అని చెప్పటంతో అక్కడ ఉన్న వారంతా ఆమెను అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.

పోటీతత్వం కన్నా క్రీడా స్ఫూర్తి గొప్పది

- వీసీ ఆచార్య గంగాధరరావు
- ఏఎన్‌యూలో ప్రారంభమైన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య కే గంగాధర్

పెదకాకాని, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పోటీ తత్వంకన్నా క్రీడ స్ఫూర్తి ఎంతో గొప్పదని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో సౌత్- వెస్ట్ జోన్ మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు మంగళవారం అట్ట హాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ పాల్గొన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రీడలకు ఉన్న ప్రాధాన్యత మరే రంగంలో కూడా ఉండదని అన్నారు. దేశ భవిష్యత్తును, వ్యక్తిగత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని క్రీడాకారులు రాణించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని, అదే వారిని విజేతలుగా నిలుపుతుందని అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడలకు పుట్టి నిల్లుగా నిలుస్తోందని, ఇటువంటి ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలను ఆస్వాదిస్తూ క్రీడాకారులు మంచి ప్రదర్శనలు ఇవ్వాలని అన్నారు. రెక్టర్ ఆచార్య కే రత్న షీలామణి మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ,శారీరక దృఢత్వంతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం మాట్లాడుతూ మహిళలు వెయిట్ లిఫ్టింగ్ లో రాణించడం గొప్ప విషయమని అన్నారు. వారిని ప్రోత్సహిస్తున్న వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియ జేశారు. భవిష్యత్తులో కూడా అనుకున్న లక్ష్యాలు సాధించాలని సూచిం చారు. క్రీడల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పిపిఎస్ పాల్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఈ క్రీడల్లో ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రతిభ ఉన్న వారికే పతకాలు లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం తొలి రోజు పోటీలలో పతకాలు సాధించిన మహిళా వెయిట్ లిఫ్టర్లకు మెడల్స్ ను అందజేశారు. ఆలిండియా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య టెక్నికల్ కమిటీకి చీఫ్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో వ్యాయామ కళా శాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీ జాన్సన్, అధ్యాపకులు డాక్టర్ యిన్నయ్య, డాక్టర్ రామ్మోహనరావు, డాక్టర్ డీసూర్యనారాయణ పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీలో క్రీడాకారిణుల ప్రదర్శన

మహిళా విభాగంలో తొలి రోజు ఫలితాలు

సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ మహిళల విభాగం 45 కేజీల విభాగంలో శివాజీ యూనివర్సిటీ (కొల్హాపూర్) క్రీడాకారిణి సర్దార్ కాజోల్ మహదేవ్ బంగారు పతకం, మంగళూరు యూనివర్సిటీకి చెందిన స్పందన వెండి పతకం, యోగివేమన యూనివర్సిటీకి చెందిన ఆర్. గోగోయి కాంస్యపతకం సాధించారు. 49 కేజీల విభాగంలో, ముంబై యూనివర్సిటీకి చెందిన సౌమ్య దాల్వి బంగారు పతకం, గుజరాత్ లోని జైన్ యూనివర్సిటీ క్రీడాకారిని ఠాక్కోం సంజు దేవి వెండి పతకం, కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ క్రీడాకారిణి ఎస్.అను కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. 55 కేజీల విభాగంలో, శ్రీకాకుళంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ క్రీడాకారిణి దూబా హేమశ్రీ బంగారు పతకం పొందగా గుజరాత్ లోని మార్వాడి యూనివర్సిటీ క్రీడాకారిని శర్మ విద్య వెండి పతకం, శివాజీ యూనివర్సిటీ కి చెందిన క్రీడాకారిని కమలాకర్ నికిత సునీల్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నారు.

ఈపూరులో రెండు దుకాణాలలో చోరీ

ఈపూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఈపూరులో రెండు దుకాణాలలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ప్రధాన రోడ్డుపక్కన ఉన్న మహాలక్ష్మీ పెయింట్స్ అండ్ హార్డ్‌వేర్ షాపులో రూ.1.20 లక్షలు నగదు, సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌లు, పరిమళ ఫర్టిలైజర్స్ షాపులో రూ.20వేలు నగదు అపహరించుకుపోయారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

క్రైమ్ జోన్

గొరిజవోలులో మూడు గృహాల్లో చోరీ

నాదెండ్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిజవోలులో మూడు ఇళ్లల్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ చోరీలో సుమారు రూ.2లక్షలకు పైగా విలువైన నగదుతో పాటు బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన పోపూరి మస్తాన్‌రావు, పద్మావతి దంపతులు సోమవారం పిడుగురాళ్లలో జరిగిన ఒక శుభ కార్యక్రమానికి వెళ్లారు. అదేవిధంగా దివ్వ కోటేశ్వరరావు కుమారుడు రష్యాలో ఉండటంతో వాళ్ల దంపతులు అక్కడకు వెళ్లారు. మరో ఇల్లు వల్లూరు సత్యనారాయణ కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లకు వెళ్లారు. తాళాలువేసి ఉన్న ఈ మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. మస్తాన్‌రావు ఇంట్లో రూ.70వేల నగదుతో పాటు సుమారు రెండు సవర్ల బంగారం, చిన్న చిన్న వెండి వస్తువులు అపహరించారు. కోటేశ్వరరావు ఇంట్లో వెండి వస్తువులు చోరీకి గురి కాగా సత్యనారాయణ ఇంట్లో ఎలాంటి వస్తువులు పోలేదు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ పుల్లారావు గ్రామానికి వచ్చి ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రల నమూనాలను సేకరించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు గ్రామంలో కత్తులు, గొడ్డళ్ళు తయారుచేసే పని చేస్తున్నారు. వారిపై అనుమానంతో వారి నుంచి కూడా వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియా రిమాండ్ ఖైదీలకు అంబటి, గోపిరెడ్డి పరామర్శ

నరసరావుపేట లీగల్, నవంబరు 26: స్థానిక ప్రత్యేకశ్రేణి ఉపకారాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వైసీపీకి చెందిన సోషల్ మీడియా కేసులో నిందితులను వైసీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. సుధారాణి, వెంకటరెడ్డి, ఇంటూరి కిరణ్‌ను రాష్ట్ర మాజీమంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు పరామర్శించారు.

క్లుప్తంగా...

● చిలకలూరిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులకు మంగళవారం సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించి చిలకలూరిపేట అర్బన్ పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అర్బన్ సీఐ పి రమేష్, అర్బన్ ఎస్ఐలు రహంతుల్లా, శివరామకృష్ణ పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మండలంలోని పసుమర్రు జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం చిలకలూరిపేట రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. రూరల్ ఎస్ఐ జి అనిల్ కుమార్ పలు విషయాలపై అవగాహన కల్పించారు.

● నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఎం. హేమంత్, ఎస్.సాహిత్యరెడ్డి, పి.వినీత, సీపీఎల్ మణికుమార్, రాజస్థాన్ రాష్ట్రంలో నవంబరు 14 నుంచి 25వరకు జాతీయస్థాయి శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులను మంగళవారం కళాశాలలో అభినందించారు.

● పాలపాడు (నరసరావుపేట రూరల్): మండలంలోని పాలపాడులో వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సాగుచేస్తున్న వరి పంటలను మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పులిమి రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ మస్తానమ్మ మంగళవారం తెలిపారు. మండలంలోని సంతగుడిపాడు, కర్లకుంట గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో శివలలిత, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● ఈపూరు: మండలంలోని భద్రుపాలెం, ఇనుమెళ్ల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు పంట పొలాలను పరిశీలించారు. వరిలో మెడవిరుపు రాకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు.

● శావల్యాపురం: కోతదశకు చేరిన వరి పంటలో దోమలు, కీటకాలను సకాలంలో నివారించినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని వేల్పూరు, కొత్తలూరు గ్రామాల్లో వరిపంటను ఏడీఏ బోయపాటి రవిబాబుతో కలసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో పూరేటి అశోక, ఎంపీఈవో హరిబాబు, అమూష, శ్రీనివాసరావు, వీపీఏలు పాల్గొన్నారు.

● వినుకొండ: మార్కాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారణ స్వాములకు మంగళవారం సద్ది ఏర్పాటుచేసి కుటుంబ సభ్యులతో కలిసి పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నగుర్నాథం దంపతులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: రేషన్ సరుకులను సకాలంలో అందించాలని తహసీల్దార్ జీ రమేష్ కుమార్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో రేషన్ డీలర్లకు, ఎండీయూ ఆపరేటర్లకు మంగళవారం సమావేశం నిర్వహించారు.

పడకేసిన ఆర్వో ప్లాంట్... తాగునీటికి తంటాలు..

● సురక్షిత నీటి కోసం రూ.2.29 కోట్లతో పథకం
● మైక్రో ఫిల్టర్ మరమ్మతులతో నిలిచిన ప్లాంట్
● 18 గ్రామాలకు అందని పరిశుద్ధ జలం


మూతపడిన ఆర్వోప్లాంటు, ప్లాంటు వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్లు

వినుకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరైడ్ నీటి నుంచి ప్రజలను రక్షించి సురక్షితమైన తాగునీటిని అందించాలనే మంచి ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం 2018 సంవత్సరంలో ఎంపీ నిధులతో వినుకొండ మండలం పెదకంచర్ల,నూజెండ్ల గ్రామాలలో క్లస్టర్ ఆర్వో ప్లాంటుకు ముందుకు వచ్చింది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ద్వారా అప్పటి ఎంపీ రాయపాటి సాంబశివరావు చొరవతో క్లస్టర్ ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. నూజెండ్లలో పథకం ప్రారంభానికి పునాది వేశారు. ఆ తరువాత పనులు జరగలేదు. అనంతరం పెదకంచర్లలో రూ.2.29కోట్లతో క్లస్టర్ ఆర్వో ప్లాంటు నిర్మించారు. మదర్ ప్లాంటు నిర్మించి అక్కడ నుంచి చుట్టు పక్కల 18 గ్రామాలకు నీటి సరఫరా అందించేందుకు రూపకల్పన చేశారు. గ్రామాలకు నీరు సరఫరాకు నాలుగు ట్రాక్టర్లు, ట్యాంకర్లు తెచ్చారు. గ్రామానికొక ఆర్డీయూ నిర్మించి మదర్ ప్లాంటు నుంచి ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేశారు. 20లీటర్ల క్యాను రూ.2కే అందించేందుకు ఏర్పాటు చేశారు. 2021 జూన్‌లో ప్లాంటు నుంచి నీటిని ప్రారంభించారు. పది నెలల తరువాత మైక్రో ఫిల్టర్ చెడిపోయింది. దాంతో 2022 ఏప్రిల్ నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. అడపాదడపా నీటిని సరఫరా చేసినప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీటిని అందించలేకపోతున్నారు. అయితే గుత్తేదారు, అధికారుల వైఫల్యంతో పథకం మూలన పడింది. ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుచున్నారు. పథకానికి కేటాయించిన ట్రాక్టర్లు ఇష్టం వచ్చినట్లు ఎవరి అవసరాలకు వారు వాడుకుంటున్నారు. పథకం వద్ద మూడు ట్రాక్టర్లు, ట్యాంకర్లు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి 6వేల మంది ప్రజలకు శుద్ధనీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.

దోపిడీ తప్ప ప్రజా సమస్యలపై దృష్టిలేదు
● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



టీడీపీ ప్రభుత్వం ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించేందుకు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినప్పటికీ అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రజాధనాన్ని దోచుకోవడం తప్ప ఎక్కడా కూడా పరిష్కరిద్దామనే ఆలోచన చేయలేదు. కూటమి ప్రభుత్వంలో రక్షిత తాగునీటి పథకాను తిరిగి పునరుద్ధరించి, తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రజాధనం వృథా అయింది: మక్కెన రమేష్



ప్రజలను ఫ్లోరైడ్ సమస్య నుంచి రక్షించేందుకు సురక్షితమైన నీటిని అందించాలని రూ.కోట్లు ఖర్చు పెట్టి పథకం నిర్మిస్తే అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో అది మూతపడి, ప్రజాధనం వృథా అయింది. అదేవిధంగా సురక్షితనీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. ఏళ్ళు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో 20లీటర్ల తాగునీటి డబ్బా రూ.10లకు కొనుగోలు చేసి తాగుతున్నాం. నీరు కొనలేని పేదవారు బావి, చేతి పంపుల నీరు తాగుతూ రోగాల బారినపడుచున్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

నరసరావుపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట పేట పట్టణంలో మంగళవారం ఘనంగా రాజ్యాంగ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. దీనిలో బాగంగా పట్టణంలోని ఎస్‌బీటీ అండ్ ఎస్‌వీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో సెక్రటరీ ఆట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఏఎం గ్రూప్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, న్యాయవాది బీ సలీమ్, కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వీర బ్రహ్మం, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కే-రిడ్జి స్కూల్ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, అకాడమిక్ కోఆర్డినేటర్ హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు. పీఎన్‌సీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డాక్టర్ ఎం అన్నపూర్ణమ్మ, పీ శ్రీనివాసప్రసాదు, హెచ్‌ఎం సుభాష్ చంద్రబోస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా పట్టణంలోని బాపనయ్య నగర్ డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ స్కూల్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళుఅర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, విద్యార్థులు పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారత బచావో ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భారత బచావో జిల్లా అధ్యక్షుడు వీ కోటా నాయక్, కోలా నవజ్యోతి, పీడీఎం నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, కేఎస్‌పీఎస్ నాయకుడు కే కృష్ణ, గిరిజన ఐక్యవేదిక నాయకుడు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ డాక్టర్ పత్తిపాటి విజయకుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, అకౌంట్స్ ఆఫీసర్ పీ వెంకటేశ్వర్లు, బంగారయ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నాదెండ్ల: గణపవరం గ్రామాన్ని పంచాయతీగానే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం తీర్మానం చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్‌డీ లక్ష్మీకుమారి, కార్యదర్శి మారుతీ బాబు తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: మానస సరోవర్ పథకం కింద ఎంపికైన మండలంలోని యడ్లపాడు, సొలస గ్రామాల్లోని చెరువుల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో హేమలతాదేవి, పంచాయతీ కార్యదర్శి శశికళ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి నరసరావుపేట పట్టణంలోని స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు

● చిలకలూరిపేట: పట్టణంలోని ఏఎంజీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవమను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు జరిగాయి.

● వినుకొండ: రాజ్యంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ ప్రచార వేదిక కన్వీనర్ జుజ్జూరి బిరామమూర్తి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీచేపట్టారు.


సదస్సులో మాట్లాడుతున్న మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ప్రవల్లిక


పోలీసులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ

ఘనంగా న్యాయ దినోత్సవం

నర్సరావుపేట లీగల్, నవంబర్ 26, (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ ఆమోదించి 75 వసంతాలు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని రాజ్యాంగ ఆమోద దినోత్సవం లాడే గా మంగళవారం పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు అధికారులు సిబ్బంది రాజ్యాంగబద్ధంగా నడవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్ ఏఆర్డీఎస్పీ గాంధీ రెడ్డి పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: స్థానిక మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని రామిరెడ్డి పేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో రాజ్యాంగ దినోత్సవాన్ని, వరకట్న వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి టి ప్రవల్లిక పాల్గొని రాజ్యాంగ ప్రాముఖ్యంను వివరించారు. కార్యక్రమంలో మొదటి పట్టణ ఎస్ఐ అరుణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరి, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం న్యాయ దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అయిన జడ్జి కె నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును కూడా నిర్వహించారు. గార్డ్ సంస్థ ఆధ్వర్యంలో కూడా శాఖ గ్రంథాలయంలో న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

పేదల పెన్నిధి సీఎం సహాయ నిధి: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు పెన్నిధి అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేట పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ జరిగింది. రూ.10లక్షల 62వేల 294లు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వరికపూడిశల ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలి

● పల్నాడు జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కార్మిక సంఘాల డిమాండ్

నరసరావుపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా రైతులు ఎదురు చూస్తున్న వరికపూడిశల ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని పల్నాడు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పల్నాడు జిల్లా రైతులు సాగునీటి కోసం ఎదుర్కొంటున్న సమస్యలు, అనేక రైతాంగ సమస్యలపై పల్నాడు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ వరికపూడిశల పూర్తిచేసి పల్నాడు, ప్రకాశం జిల్లాల, నాలుగు మండలాల రైతులకు, ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమితి ఆంధ్రప్రదేశ్ సంఘం, కార్మిక సంఘాల సమన్వయ సమితి పల్నాడు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై విద్యార్థులకు అవగాహన

యడ్లపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెలుగు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రియదర్శిని మంగళవారం విద్యార్థులకు లింగ వివక్షత, పిల్లల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతేగాకుండా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభారతి, ఉపాధ్యాయులు, వెలుగు ఏపీఎం రవీంద్రకుమార్, సీసీలు పేరమ్మ, వీవోఏలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

శావల్యాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నతమైన బోధనతో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందింపజేయాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని పిచికలపాలెం ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో మహ్మద్ అఫాన్‌కు ప్రథమ స్థానం


టోర్నమెంట్‌లో మొదటి బహుమతి సాధించిన షేక్ మహ్మద్ అఫాన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దినగర్ ప్రాంతానికి చెందిన ముల్లా కరిముల్లా కుమారుడు షేక్ మహ్మద్ అఫాన్ విజయవాడ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించిన ఏడవ స్కై మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి సాధించాడు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో నిర్వహించే నేషనల్ గేమ్స్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిశారు. ప్రత్తిపాటి అఫాన్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు.

ఇంటి నిర్మాణదారులకు మస్టర్లు పెట్టి బిల్లులు చెల్లించాలి

● నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధలింగమూర్తి

వినుకొండ టౌన్,నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో హార్టికల్చర్ పనులను త్వరగా పూర్తిచేయాలని, నివాస గృహాల నిర్మాణదారులకు మస్టర్లు పెట్టి బిల్లులు చెల్లించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ యం.సిద్ధలింగమూర్తి ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి జాతీయ ఉపాధిహామీ పథకం అధికారులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సిద్ధలింగమూర్తి మాట్లాడుతూ ప్రతి మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ నియామకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో మంజూరైన గృహనిర్మాణాలపై శ్రద్ధ చూపాలని వారికి 90 రోజుల పని కల్పించి మస్టర్ చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో బూసిరెడ్డి, వినుకొండ ఎంపీడీవో పుట్టారెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డిపాలెంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో కూల్చిన నిర్మాణాల పరిశీలన

రొంపిచర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపాలెంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూల్చివేసిన నిర్మాణాలను డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి మంగళవారం పరిశీలించారు. ఆర్చి, శ్మశాన ప్రహరీ, చెక్ డ్యామ్‌లను గతంలో పడవేశారు. వీటి పరిశీలనకు కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాల మేరకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం రొంపిచర్ల పోలీసు స్టేషన్ సమీపంలో మినీ గోకులాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ బండి నిర్మల, ఎంపీడీవో మాధ్యూబాబు, ఉపాధి హామీ అధికారులు ఉన్నారు.

నాటు సారా తయారీ కేంద్రాల కోసం తనిఖీలు

ఈపూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుమెళ్ల సమీపంలోని అడవి, పొలాలలో ఈపూరు, వినుకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డీ వెంకటేశ్వర్లు, సిబ్బంది నాటుసారాయి తయారీ కేంద్రాలకోసం మంగళవారం గాలింపు చేపట్టారు. గుట్టలు, బీడు భూములు, వాగులలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా సారాయి రవాణా చేసినా, తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. వినుకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ వినీల,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సురేష్, మోహన్‌రావు, మస్తాన్‌వలిలు తనిఖీలలో పాల్గొన్నారు.


వినుకొండకు తీసుకువచ్చిన 108 వాహనం, రోగినంటూ 108 వాహనం ఎక్కివచ్చి ప్రయాణికుల్లా రోడ్డుదారిపట్టిన కుటుంబం

108 వాహన సేవలు దుర్వినియోగం

● ఆపదలో ఉన్నట్లు ఫోన్‌చేసి 108లో వచ్చి గుంటూరుకు..
● కంఢ్రిక గ్రామస్థుల తీరుపై అంబులెన్స్ సిబ్బంది విస్మయం

వినుకొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న రోగులకు ఆపన్న హస్తంగా అందిస్తున్న 108 సేవలను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం కంఢ్రిక గ్రామానికి చెందిన మన్నెయ్యకు కడుపులో నొప్పిరావడంతో మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు 108కి ఫోన్‌చేశారు. ఆపదలో ఉన్నట్లు మన్నెయ్యతోపాటు భార్య దుప్పట్లు కప్పుకొని రోగులుగా 108 సిబ్బంది ఎదుట బిల్డప్ ఇచ్చారు. ఉదయం 5 గంటల సమయంలో 108 వాహనం గ్రామానికి చేరుకొని మన్నెయ్యను అతని కుటుంబ సభ్యులను 6గంటలకల్లా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదంతా ఒక ఎత్తయితే 108 వాహనం నుంచి దిగిన వెంటనే సదరు వ్యక్తులు ఒక్క నిమిషంలో తమతో తెచ్చుకున్న దుప్పట్లను మడతపెట్టి సంచిలో పెట్టుకున్నారు. మరుక్షణం మన్నెయ్య తనతో వచ్చిన ఆయన భార్య కుమారుడు రోడ్డు బాటపట్టారు. ఇదేమని 108 సిబ్బంది ప్రశ్నించగా, తెల్లవారుజామున మా ఊరు నుంచి వినుకొండ రావడానికి వాహనాలు లేకపోవడంతో 108కి ఫోన్ చేయాల్సి వచ్చిందని, మా నాన్నకు గుండె సంబంధిత వ్యాధి ఉందని గుంటూరులో చూపించుకునేందుకు వెళ్తున్నామని మన్నెయ్య కుమారుడు చెప్పడంతో వైద్యశాల రోగులతోపాటు 108 సిబ్బంది కంగుతిన్నారు. కొసమెరుపు ఏమిటంటే కంఢ్రిక నుంచి వినుకొండకు తెల్లవారుజామున 5 గంటలకు నైట్‌హాల్ట్ బస్సు ఉన్నట్లు ఆర్టీసీవర్గాలు తెలిపాయి.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● మంత్రి లోకేశ్‌ను కోరిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించి ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. మంగళవారం రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో కలసి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై ప్రత్తిపాటి చర్చించారు. కొండవీడుకోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని, అలాగే కొండవీడుకోటను జాతీయరహదారికి అనుసంధానం చేస్తూ రోడ్డును నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పేట నియోజకవర్గంలోని పాఠశాలలకు అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడల నిర్మాణం, మరమ్మతులకు, కొత్తగా ఏర్పాటైన పాఠశాలల్లో నూతన భవనాల నిర్మాణానికి, ముస్లిం మైనారిటీ బాలికల వసతి గృహానికి నిధులు కేటాయించి సహకరించాలన్నారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించి సత్వరమే వాటిని రైతులకు అందుబాటులోకి తేవాలని, చిలకలూరిపేట పట్టణవాసుల దాహార్తిని తీర్చే అమృత్ పథకానికి, టిడ్కో గృహ సముదాయాల ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని, పురపాలక సంఘానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. లోకేశ్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ప్రత్తిపాటి వెల్లడించారు.


రేమిడిచర్ల పొలంలో తీసిన మట్టి

బొల్లాపల్లి మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు

బొల్లాపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల, మేళ్లవాగు, వడ్డెంగుంట గ్రామాల్లో జేసీబీ యంత్రాలతో తీసిన మట్టిని క్వారీ టిప్పర్ల ద్వారా వినుకొండకు తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే రేమిడిచర్లలో ప్రభుత్వ భూముల నుంచి మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నారని ఆ గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇటీవల గ్రామంలోని ఊర చెరువు అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఊరు సమీపంలో ఉన్న ఊర చెరువు, రుద్రాక్ష చెరువు యంత్రాలతో మట్టిని తరలిస్తున్నారని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకొనే నాథుడే లేడని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని, వీరిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్లాన్ తయారుచేసిన వారిని బాధ్యులుగా చేయడం సరికాదు

● లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్య

నరసరావుపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎవరైతే భవన నిర్మాణ అనుమతులు తీసికొని ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారో వారిని వదలి ప్లాన్ తయారు చేసినవారిని బాధ్యులుచేస్తూ క్రిమినల్ కేసులు నమోదు చేయడం సరికాదని లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాయిడి బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాయిడి బ్రహ్మయ్య మాట్లాడుతూ అనుమతులు సులభతరం చేస్తూ డిసెంబరు 31 నుంచి అమలు చేస్తున్నామని మున్సిపల్ శాఖ మంత్రి పీ నారాయణ చెప్పడం శుభపరిణామమే అన్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కట్టే నిర్మాణాలను ఆపే అధికారాలు ఇంజనీర్లకు ఉండవన్నారు. అలాగే వారు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే మా లైసెన్స్‌లు రద్దు చేస్తామని చెప్పడం సరికాదని అన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఇంజనీర్స్ అసోసియేషన్ సంక్షేమ సంఘ సంయుక్త కార్యదర్శి బొందిలి శ్రీనివాస్‌సింగ్, ఉమ్మడి గుంటూరు జిల్లా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మసాని కమలాకరరెడ్డి, గౌరవ అధ్యక్షుడు జీపీ రంగయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మురారి అంజనేయులు, సంయుక్త కార్యదర్శి అబ్దుల్‌కరీమ్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

5న నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

శావల్యాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాగునీటిసంఘాల ఎన్నికలకు డిసెంబరు 5వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు లింగంగుంట్ల సర్కిల్ డీఈఈ రామారావు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గంటవారిపాలెం సెక్షన్ పరిధిలో మొత్తం 11సాగునీటి సంఘాలు ఉన్నాయని, వీటికి సంబంధించిన ఓటరు జాబితాలు తహసీల్దార్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. డిసెంబరు 8న సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యుల ఎన్నికను నిర్వహించడం జరుగుతుందన్నారు.

GENERAL NOTICE
IN THE COURT OF THE XIII ADDL. DIST AND SESSIONS JUDGE: NARSARAOPET
G.W.O.P. No.1307 / 2024
Between:
Ganesuni Manasa, W/o. late Popuri Uday kiran, Rep. by G.P.A agent father in law / uncle /Mamayya Popuri Hanumantha Rao, S/o.Venkateswarlu, aged 63 years, R/o. D No.10-136/4, Boddurayi Centre, Dinthenapadu(V), Yadlapadu(Md), Palnadu Dt.A.P. ...Petitioner
And
Nil ...Respondents
పై నెంబర్ ఓ.పి.లోని పిటీషనర్ తమ మైనరు కుమార్తె అయిన పోపూరి శ్రేయ అస్తిని అమ్ముటకు పర్మిషన్‌కొరుతూ పిటీషన్ దాఖలుచేయగా సదరు పిటీషనుపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉన్నయెడల తెలుపుకొనవలసినదిగా కోరుతూ శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం **ది.20-12-2024**కి వాయిదావేశారు. కావున ఆక్షేపణలు ఉన్నవారు వాయిదా రోజున **ఉ.గం. 10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట హాజరై వారికిగల ఆక్షేపణలు తెలుపుకోనవలసినదిగా లేని యెడల వారి పరోక్షమును తీర్మానించబడును.
Schedule:Narsaraopet regd. Dist. Chilakaluripet Sub-Dist. Nadendla (Md), Ganapavaram Grama panchayat, Ganapavaram(V) limits and Sy.No.453-3 an extent of 0.95 cents out of 0.45 cents or 2178sq yards of vacant land Ac. 0.45 cents of land bounded by, **East**: Land belongs to Inturi Kohini, **South**:Land belongs to M. subbayamma,**West**:Land belongs to Popuri Hanumantha Rao,**North**:Land belongs to Ganga Srinivas Rao. In between these boundaries an extent of Ac. 0.45 cents equivalent to 2178sq.yards, Ganapavaram khata No.2018 of vacant land with all easement rights.
S. DEEPAK CHOWDARY, Y.B.S. PAVAN KUMAR,
Advocates for Petitioner, Guntur. Cell: 7013316505